# ఉదయం భానుడి భగభగలు.. సాయంత్రం వరుణుడి పలకరింపు !



**హైదరాబాద్ పెన్ పవర్:** మండలంలో ఆదివారం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపించడంతో ఎండ తీవ్రత, ఉక్కపోత ఎక్కువగా ఉంది. అయితే, సాయంత్రం అయ్యేసరికి వాతావరణం హఠాత్తుగా చల్లబడింది. ఆకాశంలో నల్లటి మబ్బులు కమ్ముకొని మండల కేంద్రమైనతో పాటు చుట్టుపక్కల పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న జనానికి ఈ ఆకస్మిక వర్షంతో ఒక్కసారిగా ఉపశమనం లభించింది. వాతావరణం పూర్తిగా చల్లబడటంతో జనం సేదతీరారు. సకాలంలో వర్షాలు కురవాలని, కరువు కాటకాలు పోవాలని మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు, మొక్కులు మొక్కుతున్న తరుణంలోనే.. ఇలా హఠాత్తుగా వరుణ దేవుడు కరుణించి వర్షం కురిపించడం పై స్థానికులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్



# విద్యుత్ ఉద్యమం తరహాలో ఇళ్ల కోసం పోరాటం చేస్తాం

## కూనంనేని కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలోని నిరుపేదలకు ఇళు,, ఇంటి స్థలం సాధించడమే లక్ష్యంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యమం తరహాలో మరో పోరాటానికి శ్రీకారం చుట్టనున్నట్లు వామపక్ష పార్టీల నేతలు ప్రకటించారు. గుండ్ల సింగారం, గోపాల్ పూర్ తొలగించిన గుడిసెల స్థానాల్లో పేదలకు ఇళ్ల కట్టించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో 10 వేల మందితో ఈ నెల 27న హనుమకొండలో భారీ ప్రదర్శనను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆదివారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం యాదవ్?లో కలిసి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు, ఇళ్ల కోసం జూలై 1న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, కలెక్టర్ కార్యాలయాల ముందు పెద్ద ఎత్తున ముట్టడి, నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన పేదల నుంచి దరఖాస్తులను సేకరించి జూలై 6న ఇందిరాపార్కు వద్ద వేలాది మందితో ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పేదల నుంచి సేకరించిన దరఖాస్తులను నేరుగా సమర్పిస్తామన్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి స్పందన మేరకు తమ ఉద్యమ కార్యాచరణ ఉంటుందని వారు చెప్పారు హనుమకొండ జిల్లా గుండ్ల సింగారంలో గత 4 ఏళ్లుగా నిరుపేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తుంటే అధికారులు, పోలీసులు దొంగల మాదిరిగా అర్ధరాత్రి సమయంలో గ్రామంపై పడి ఎలాంటి విచక్షణ లేకుండా పేదల ఇళ్లను కూల్చివేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, పిల్లలు అని కూడా చూడకుండా బలవంతంగా లాగి పడేసి అడ్డు వచ్చిన యువకులు, వృద్ధుల కాళ్ళు చేతులు మడిచి మరీ బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించి, సుమారు 400 మందిని అక్రమంగా అరెస్ట్ చేశారని మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా మరో 40 మందికి ఇక్కడే పట్టాలు ఇవ్వగా ప్రస్తుతం బాధితులు కేవలం 8 ఎకరాల పరిధిలోనే గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని తెలిపారు. ఇక్కడ, కాల్వ ద్వారా నీరు వచ్చే పరిస్థితి లేకపోయినా అధికారులు గుడిసెలు కూల్చివేశారని, ఇప్పటికే ఈ సర్వే నంబర్లలోని వందలాది ఎకరాలు ఇతరుల ఆధీనంలో ఉన్నాయని, వాటిని ఎందుకు కూల్చివేయలేదని ప్రశ్నించారు. గోపాల్ గుండ్ల సింగారం బాధితులకు వెలుగుమట్ల తరహాలోనే ప్రత్యామ్నాయ ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ మహానగరంతో పాటు రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్, మహబూబాబాద్, భూపాలపల్లి, కొత్తగూడెం,

- మిగతా 4లో...

# ప్రశాంతంగా నీట్ రీ-ఎగ్జామ్

## రాష్ట్రంలో 89.09 శాతం అభ్యర్థులు హాజరు

## రంగారెడ్డి జిల్లాలో ఓ అభ్యర్థిపై మాల్‌ప్రాక్టీస్ కేసు







**హైదరాబాద్ పెన్ పవర్:** దేశవ్యాప్తంగా ఆదివారం 'నీట్' రీ-ఎగ్జామ్ ప్రశాంతంగా జరిగింది. రాష్ట్రంలో 89.09 శాతం అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. మే 3న జరిగిన పరీక్షతో పోలిస్తే ఈసారి 8.55 శాతం హాజరు తగ్గడం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా 24 పట్టణాల్లోని 208 కేంద్రాల్లో నీట్ నిర్వహించారు. మొత్తం 73,059 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా.. 65,087 మంది హాజరయ్యారు. పలువురు విద్యార్థులు కొద్ది ఆలస్యంతో పరీక్ష కేంద్రాలకు చేరుకుని.. అనుమతించాలంటూ సిబ్బందిని ప్రాధేయపడి నిరాశతో వెనుదిరిగారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ డైరెక్టర్ కార్యాలయంలో రాష్ట్రంలోని అన్ని పరీక్ష కేంద్రాలతో అనుసంధానం చేసిన నీట్ - యూజీ 2026 కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు.

**ఈ సారి ప్రశ్నపత్రం కఠినమే!**

మే 3న జరిగిన పరీక్షతో పోల్చుకుంటే ఆదివారం జరిగిన రీ-ఎగ్జామ్ ప్రశ్న పత్రంలోని ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులలో స్కోరింగ్ చేసే అవకాశం తక్కువగా ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. బయాలజీలో మాత్రం స్కోరింగ్‌కు అవకాశం ఉందని చెబుతున్నారు. 'ఫిజిక్స్‌లో ప్రశ్నలు ఎక్కువ సమయం తీసుకునే విధంగా ఉన్నాయి. 4 నుంచి 5 ప్రశ్నలు అయోమయానికి గురిచేసే విధంగా ఉన్నాయి. కెమిస్ట్రీలో న్యూమరికల్, మెమరీ బేస్డ్ ప్రశ్నలు అధిక సంఖ్యలో ఉన్నాయి' అని హైదరాబాద్‌కు చెందిన విద్యా నిపుణుడు కె.రవీంద్రకుమార్ అభిప్రాయపడ్డారు. బయాలజీ ప్రశ్నపత్రం సులువుగా ఉందని.. ఫిజిక్స్, కెమిస్ట్రీ కఠినంగా ఉన్నాయని శ్రీచైతన్య కళాశాల కూకట్‌పల్లి బ్రాంచ్ డీన్ శంకర్‌రావు విశ్లేషించారు.

- మిగతా 4లో...

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# హుజూరాబాద్ ఆర్టీసీ బస్‌స్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి



**హైదరాబాద్ పెన్ పవర్:** హుజూరాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్‌స్టేషన్‌లో అందుతున్న సేవల పై ఆయన స్వయంగా ఆరా తీశారు.

**ప్రయాణికులతో ముఖాముఖి.. సమస్యల గుర్తింపు**

మంత్రి బస్‌స్టేషన్‌లో వేచి ఉన్న ప్రయాణికులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్సుల సమయపాలన, ప్రాంగణంలోని పరిశుభ్రత, తాగునీటి వసతి, ప్రయాణికులకు అందుతున్న ఇతర సౌకర్యాల పై వారి ఫీడ్‌బ్యాక్‌ను తీసుకున్నారు. అనంతరం బస్‌స్టేషన్ పరిసరాలన్నింటినీ ఆయన నిశితంగా పరిశీలించారు.

**అధికారులకు కఠిన ఆదేశాలు..**

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్సుల నిర్వహణ సాగాలి. సౌకర్యాల కల్పనలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదు అని ఆయన అధికారులను గట్టిగా ఆదేశించారు.

**మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉంది..**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కేవలం మహిళలకు ప్రయాణ వెసులుబాటు కల్పించడమే కాకుండా, వారిని బస్సుల యజమానులుగా నిలబెడుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు. మహిళలు అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించి, సమాజంలో ముందుండడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్మన్ రొంటాల సుహాసిని, స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

- మిగతా 4లో...

## కేంద్రంపై ఉమ్మడి పోరుకు తెలంగాణ సై!

## వీబీజీ రామ్‌జీపై క్యాబినెట్ సబ్ కమిటీ భేటీలో కీలక నిర్ణయాలు

# కందనూల్లో మంత్రి సీతక్క పర్యటన



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ ఈ నెల 22వ తేదీ సోమవారం నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు నాగర్‌కర్నూల్ శాసనసభ్యుడు డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడంతో పాటు మహిళా సంక్షేమం, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలను మంత్రి సీతక్క పరిశీలించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

- మిగతా 4లో...

# కేంద్రంపై ఉమ్మడి పోరుకు తెలంగాణ సై! వీబీజీ రామ్‌జీపై క్యాబినెట్ సబ్ కమిటీ భేటీలో కీలక నిర్ణయాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీజీ రామ్‌జీ చట్టం-2025పై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ చట్టం వల్ల రాష్ట్రాలపై పడే ఆర్థిక భారం, గ్రామీణ ఉపాధి హామీ పథకం భవిష్యత్తుపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటైన 'కేబినెట్ సబ్ కమిటీ' సచివాలయంలో ఆదివారం సమావేశమైంది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, డా.వివేక్ వెంకటస్వామి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గ్రామీణ ఉపాధి, రాష్ట్రాల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా కేంద్ర నిర్ణయాన్ని న్యాయపరంగా, రాజ్యాంగపరంగా సవాల్ చేయాలని కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించింది.

**60 రోజుల ఉపాధి విరామం సాధ్యం కాదు!**

కొత్త చట్టంలో ప్రతిపాదించిన 60 రోజుల ఉపాధి విరామం గ్రామీణ ప్రాంతాల్లో ప్రాక్టికల్‌గా సాధ్యం కాదని సబ్ కమిటీ అభిప్రాయపడింది. దీనివల్ల కూలీలకు ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో పాటు, వ్యవసాయ కార్మికుల జీవన భద్రత తీవ్రంగా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఉపాధి హామీ పనులను వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి 'మహాత్మా గాంధీ' పేరును తొలగించడం సముచితం కాదని కమిటీ స్పష్టం చేసింది. గ్రామీణ పేదలకు ఉపాధి హక్కును కల్పించిన ఈ చారిత్రాత్మక పథకానికి గాంధీజీ పేరును యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేసింది.

**రాష్ట్రాలపై 40 శాతం భారం..**

సహకార సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రాలను సంప్రదించకుండానే 40 శాతం నిధుల భారాన్ని రాష్ట్రాలపై మోపడాన్ని కమిటీ తప్పుబట్టింది. "తెలంగాణ నుంచి పన్నుల రూపంలో కేంద్రానికి వెళ్తున్న ప్రతి రూపాయికి తిరిగి వస్తున్నది కేవలం 40 పైసలే. అలాంటప్పుడు వీబీజీ రామ్‌జీ పేరుతో అదనంగా మరో 40 శాతం భారం మోపడం ఏ రకంగా న్యాయం?" అని కమిటీ సభ్యులు ప్రశ్నించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 258(3) ప్రకారం కేంద్రం అదనపు భారం మోపితే, ఆ నష్టాన్ని కేంద్రమే భరించాలని సభ్యులు గుర్తుచేశారు. 16వ ఆర్థిక సంఘం సిఫార్సులు కూడా మెరుగైన ఫలితాలు సాధిస్తున్న రాష్ట్రాలకు నష్టం చేకూర్చేలా ఉన్నాయని మంత్రులు పేర్కొన్నారు.

**విపక్ష రాష్ట్రాలతో ఉమ్మడి పోరు..**

ఈ చట్టానికి వ్యతిరేకంగా విడివిడిగా కాకుండా, అన్ని రాష్ట్రాలను కలుపుకొని ఉమ్మడి కార్యాచరణ చేపట్టాలని సబ్ కమిటీ నిర్ణయించింది. ఇందులో భాగంగా కర్ణాటక, కేరళ, జార్ఖండ్, తమిళనాడు, పంజాబ్ వంటి విపక్ష పాలిత రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాలని మంత్రులు నిర్ణయించారు. అవసరమైతే అన్ని రాష్ట్రాలు కలిసి సంయుక్తంగా సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశాన్ని కూడా పరిశీలిస్తామని కమిటీ స్పష్టం చేసింది. త్వరలోనే న్యాయ నిపుణుల అభిప్రాయాలను సేకరించి, మరో రెండు మూడు రోజుల్లో సబ్ కమిటీ రెండోసారి సమావేశం కానుంది. గ్రామీణ సంక్షేమం, ఉపాధి భద్రతను కాపాడేలా సమగ్ర నివేదికను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు కమిటీ వెల్లడించింది.

# విద్యుత్ ఉద్యమం తరహాలో ఇళ్ల కోసం పోరాటం చేస్తాం

-3 పేజి తరువాయి

ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో లక్షలాది మంది పేదలు 25, 30, 50 గజాల లోపు చిన్న చిన్న గుడిసెల్లో, మురికివాడల్లో నివసిస్తున్నారని వివరించారు. వీరంతా భూదాన్ భూములు, ప్రభుత్వ భూములు, మిగులు భూముల్లో దశాబ్దాలుగా ఉంటున్నారని వీరందరికి పట్టాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సహాయ కార్యదర్శులు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఈ.టి.నరసింహ, కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, వరంగల్ జిల్లా సెక్రటరీ బాషా మియా, హనుమకొండ జిల్లా పార్టీ కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్ , సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు కె.గోవర్ధన్, ఎంసీపీఐ నాయకులు సుధాకర్, ఎస్ నాయకులు భరత్ పాల్గొన్నారు.

## ప్రశాంతంగా నీట్ రీ-ఎగ్జామ్

-3 పేజి తరువాయి

అత్యధిక స్కోరింగ్ మార్కులు, కటాఫ్ ఈ సారి తగ్గే అవకాశం ఉందన్నారు. టాపర్లకు 700 నుంచి 710 మధ్య మార్కులు రావొచ్చని.. ఇక రాష్ట్రంలో 420 కటాఫ్ మార్కులకు జనరల్ కేటగిరీలో సీటొచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు.

**శౌచాలయంలో సెల్‌ఫోన్ దాచి... గూగుల్‌లో జవాబులు వెతుకుతూ దొరికిన అభ్యర్థి**

అచ్చంపేటకు చెందిన జండావత్ నరేందర్ ఆదివారం రంగారెడ్డి జిల్లా రాగన్నగూడలోని జడ్పీహెచ్ఎస్ కేంద్రంలో నీట్‌కు హాజరయ్యాడు. ఇన్విజిలేటర్లు ప్రశ్నపత్రాలు ఇచ్చిన తర్వాత కొద్దిసేపు గదిలోనే ఉన్న నరేందర్.. తర్వాత శౌచాలయానికి వెళ్లాడు. 10 నిమిషాల కంటే ఎక్కువ సమయం గడిచినా.. తిరిగి రాకపోవడంతో ఇన్విజిలేటర్‌కు అనుమానమొచ్చింది. ఇతర అధికారులతో కలిసి శౌచాలయానికి వెళ్లి తనిఖీ చేయగా.. నరేందర్ సెల్‌ఫోన్ వినియోగిస్తూ కనిపించాడు. గూగుల్‌లో సమాధానాల కోసం వెతుకుతున్నట్లు అధికారులు గుర్తించారు. వెంటనే అదుపులోకి తీసుకుని ఆదిభట్ల పోలీసులకు అప్పగించగా.. మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు చేశారు. ఆదివారం ఉదయం 7 గంటలకే పరీక్ష కేంద్రానికి వెళ్లి.. బాత్‌రూమ్‌లోని ఫ్లష్‌ట్యాంకులో ఫోన్ దాచిపెట్టినట్లు ఆ విద్యార్థి ఒప్పుకొన్నాడని పోలీసులు తెలిపారు.

**దేశవ్యాప్తంగా..**

దిల్లీ: దేశవ్యాప్తంగా నీట్ యూజీ రీ-ఎగ్జామ్‌కు 20 లక్షల మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. దిల్లీలోని ఎన్‌టీఏ ప్రధాన కార్యాలయం నుంచి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమీక్షించారు. అన్ని ప్రభుత్వ విభాగాల సహకారంతో పరీక్షను రికార్డు సమయం(37 రోజుల్లో)లో దిగ్విజయంగా నిర్వహించగలిగామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్ వారణాసిలో లోదుస్తుల్లో సిమ్ కార్డు, పాత పరీక్ష పత్రం, జిగురు ఉంచుకుని పరీక్షకు హాజరైన ఓ అభ్యర్థిని పోలీసులు అరెస్టు చేశారు.

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని జేఎన్టీయూ నాచుపల్లి కళాశాలలో ఉన్న పరీక్ష కేంద్రానికి మూడు నిమిషాలు ఆలస్యంగా చేరుకున్న తన కుమార్తెను అనుమతించాలంటూ భద్రతా సిబ్బంది కాళ్లు మొక్కుతున్న తల్లి. అనుమతించకపోవడంతో కుమార్తెతో కలిసి ఆవేదనతో ఆమె వెనుదిరిగారు.

**పోలీసులు.. మనసులు గెలిచారు!**

తనకు కేటాయించిన పరీక్ష కేంద్రానికి కాకుండా వేరొక కేంద్రానికి వెళ్లిన ఓ విద్యార్థినిని.. కేటాయించిన కేంద్రానికి సకాలంలో చేర్చారు జనగామ పోలీసులు. అశ్విని అనే విద్యార్థిని పెంబర్తిలోని మహాత్మా జ్యోతిబాఫులే పరీక్ష కేంద్రంలో పరీక్ష రాయాల్సింది. కానీ, ఆమె పొరపాటున జనగామలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లింది. అక్కడే విధుల్లో ఉన్న ఎస్సైలు భరత్, రతిష్, చెన్నకేశవులు విషయాన్ని డీసీపీకి దృష్టికి తీసుకెళ్లారు. ఆమెను పోలీసు వాహనంలో ఎక్కించుకుని సైరన్ మోగిస్తూ పెంబర్తిలోని కేంద్రానికి నిర్ణీత సమయానికి 9 నిమిషాల ముందే చేర్చి పరీక్ష రాసేలా కృషిచేశారు.

**తల్లి కోరిక.. 67 ఏళ్ల వయసులో 'నీట్'కు**

67 ఏళ్ల విశ్రాంత ఉద్యోగి ఎల్.టి.కరుణాకరన్ డేవిడ్ ఆదివారం దోమలగూడ ఏవీ కళాశాల పరీక్షా కేంద్రంలో నీట్ రాయడానికి వచ్చారు. తార్నాకకు చెందిన ఈయన ప్రస్తుతం టీజీఎస్ఆర్టీసీ ఆసుపత్రిలో పని చేస్తున్నారు. ఉస్మానియా ఆసుపత్రిలో గైనకాలజిస్ట్‌గా పని చేసిన తన తల్లి కోరిక మేరకు డాక్టర్ కావాలనే లక్ష్యంతో నీట్ రాస్తున్నానని కరుణాకరన్ డేవిడ్ వివరించారు.

# కేటీఆర్‌కు పనిలేక పర్యటనలు.. మళ్లీ రేవంతే సీఎం: మేడిపల్లి సత్యం కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** కేటీఆర్ పని పాట లేకుండా పర్యటనలు చేస్తున్నారని, కేటీఆర్ అసనహనంలో నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని చొప్పదండి ఎమ్మెల్యే, మేడిపల్లి సత్యం మండిపడ్డారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ సారి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 80 సీట్లు ఖాయమని, మళ్లీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినే, బీఆర్ఎస్ కు డిపాజిట్లు రాదు, ప్రతిపక్ష హోదా కూడా దక్కదని మేడిపల్లి సత్యం ధీమా వ్యక్తం చేశారు. కేటీఆర్, మా సినిమా ఫస్టు హాఫ్ సూపర్ హిట్ అయింది.. సెకండ్ హాఫ్ బ్లాక్ బస్టర్, బంపర్ హిట్ హిట్టు అవుతుందన్నారు. సెకండ్ హాఫ్ లో మీకు బొమ్మ చూపిస్తామని, ఇప్పటికే అరాచక, అవినీతి పాలనపైన తెలంగాణ ప్రజలు ఎదురుతిరిగి బీఆర్ఎస్ కు బొమ్మ చూపించారని మేడిపల్లి సత్యం ఎద్దేవా చేశారు. దేశంలో ఏ సీఎం చేయనట్లుగా రేవంత్ రెడ్డి దూసుకుపోతున్నారని, రేవంత్ రెడ్డి రెన్యువల్ సీఎం అని కేటీఆర్ అంటున్నాడని, ప్రతి ఐదేళ్ల ఒక సారి తెలంగాణ ప్రజలతో రెన్యువల్ చేయించుకుని సీఎంగా కొనసాగుతూనే ఉంటారన్నారు.

పదేళ్ల పాలనలో తెలంగాణను కల్వకుంట్ల కుటుంబం, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని ప్రాంతాల వారీగా విభజించుకుని దండుపాళ్యం బ్యాచ్‌లా దోచుకున్నారని, కల్వకుంట్ల కుటుంబం సొంత ఆడబిడ్డ కవితనే చెపుతోందని మేడిపల్లి సత్యం ఆరోపించారు. మీ కుటుంబ సభ్యురాలే మీ పాలనను, మీ పార్టీని సమర్థించడం లేదని, ఇక తెలంగాణ ప్రజలు ఎందుకు పట్టించుకుంటారని ఆయన నిలదీశారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా నిర్మాణాత్మక సలహాలు, సూచనలు ఇవ్వాలని, కానీ, ఎందుకు రేవంత్ రెడ్డి సీఎం అయ్యాడన్న అసహనం, అహంకారం మీలో కనిపిస్తోందన్నారు. కేటీఆర్ నీలాగా ఎక్కడో చదువుకుని వచ్చి రేవంత్ రెడ్డి మేనేజ్మెంట్ కోటాలో సీఎం కాలేదని, కాంగ్రెస్ లో అంచెలంచెలుగా ఎదిగి సీఎం అయ్యాడన్నారు. ప్రజల అభిమానంతో అతి తక్కువ సమయంలో సీఎం అయితే కల్వకుంట్ల కుటుంబం అసూయ, ద్వేషంతో రగిలిపోతున్నారని, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా ఇప్పటికైనా వ్యవహరించకపోతే భవిష్యత్తులో మీ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కవని మేడిపల్లి సత్యం స్పష్టం చేశారు.

# రంగపేటలో సర్పంచ్ 'టేకు' భాగోతం.. ఫారెస్ట్ అధికారుల మెరుపు దాడి !

**హైదరాబాద్ పెన్ పవర్:** నలుగురికి ఆదర్శంగా నిలవాల్సిన ప్రజాప్రతినిధే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఏమవుతుందో రంగపేట ఘటన నిరూపించింది. అధికార అహంకారంతో నాకెదురేంటి అనే ధోరణితో వ్యవహరించిన కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం రంగపేట గ్రామానికి చెందిన అధికార పార్టీ సర్పంచ్, టేకు కలపను అక్రమంగా తరలిస్తుండగా ఫారెస్ట్ అధికారులకు అడ్డంగా చిక్కాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

**పక్కా ప్రణాళికతో దాడి చేసిన అటవీశాఖ..**

హుజూరాబాద్ రేంజ్ స్పెషల్ ఫారెస్ట్ బీట్ అధికారులకు అందిన విశ్వసనీయ సమాచారంతో ఈ ఆపరేషన్‌ను పక్కాప్రణాళికతో నిర్వహించారు. సర్పంచ్ స్వయంగా టేకు కలపను ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్నాడనే సమాచారంతో సుమారు ఆరుగురు సిబ్బందితో కలిసి అధికారులు రంగంలోకి దిగారు. శనివారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో మానకొండూరు పోలీసుల సహకారంతో అక్రమ రవాణా జరుగుతున్న ట్రాక్టర్‌తో పాటు భారీ టేకు కలపను స్వాధీనం చేసుకున్నారు.



**మధ్యరాత్రి హైడ్రామా..**

పట్టుబడిన టేకు కలపను, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని తరలించేందుకు అధికారులకు చాలా సమయం పట్టింది. గ్రామానికి నాయకత్వం వహించాల్సిన సర్పంచ్ ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడటం గ్రామస్థులను ఆశ్చర్యానికి గురిచేసింది. వాల్టా (ఔయూయా) చట్టాన్ని ఉల్లంఘిస్తూ పర్యావరణానికి హాని కలిగించే విధంగా వ్యవహరించడం పై గ్రామంలో తీవ్ర చర్చ సాగుతోంది.

**కేసు నమోదు**

స్వాధీనం చేసుకున్న టేకు కలపను, ట్రాక్టర్‌ను కరీంనగర్ ఫారెస్ట్ కార్యాలయానికి తరలించిన అధికారులు కేసు నమోదు చేశారు. ఆదివారం కార్యాలయానికి సెలవు దినం కావడంతో, సోమవారం పూర్తి వివరాలతో కూడిన అధికారిక ప్రకటన విడుదల చేసే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం.

**గ్రామస్థుల ఆగ్రహం..**

చట్టాన్ని కాపాడాల్సిన ప్రజాప్రతినిధే అధికార అహంకారంతో అక్రమాలకు పాల్పడటం తీవ్ర విమర్శలకు దారితీసింది. కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరిగితే సహించబోమని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని నిరూపిస్తూ ధైర్యంగా చర్యలు తీసుకున్న ఫారెస్ట్ అధికారులను స్థానికులు అభినందిస్తున్నారు.

# కందనూల్లో మంత్రి సీతక్క పర్యటన

-3 పేజి తరువాయి

మంత్రి పర్యటన ఇలా..

ఉదయం 7.30 గంటలకు హైదరాబాద్‌లోని ప్రజాభవన్, బేగంపేట నుంచి రోడ్డు మార్గంలో నాగర్‌కర్నూల్ జిల్లాకు బయలుదేరి ఉదయం 10 గంటలకు తాడూరు మండలంలోని సిర్సవాడ గ్రామానికి చేరుకోనున్నారు. అక్కడ రూ.20 కోట్ల అంచనా వ్యయంతో దుందుభి వాగు పై హై లెవల్ బ్రిడ్జి (హెచ్‌ఎల్‌బీ) నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయిన తర్వాత సిర్సవాడతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు అన్ని కాలాల్లో సురక్షిత రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి తెలిపారు. వర్షాకాలంలో ఎదురయ్యే రాకపోకల ఇబ్బందులు తొలగిపోవడంతో పాటు గ్రామీణ ప్రాంతాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఈ వంతెన కీలకంగా మారనుందని ఎమ్మెల్యే తెలిపారు.అనంతరం మంత్రి నాగర్‌కర్నూల్ పట్టణానికి చేరుకుని మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధి అవకాశాల పెంపు లక్ష్యంగా ప్రతిపాదించిన రూ.5 కోట్ల వ్యయంతో కూడిన ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలను పరిశీలించనున్నారు. ఈ భవన్ ద్వారా మహిళా సంఘాల కార్యకలాపాలు మరింత బలోపేతం కావడంతో పాటు మహిళలకు శిక్షణ, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే తెలిపారు. తెలంగాణ పోలీస్ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారులకు భద్రత, రక్షణ, మానసిక పరామర్శ, న్యాయ సహాయం, పునరావాస సేవలను ఒకే వేదిక పై అందించేందుకు ఏర్పాటు చేయనున్న భరోసా సెంటర్ నిర్మాణానికి మంత్రి సీతక్క శంకుస్థాపన చేయనున్నారు. మహిళల భద్రత, గౌరవ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, భరోసా కేంద్రాలు బాధిత మహిళలు, చిన్నారులకు సమగ్ర సహాయాన్ని అందించే కీలక కేంద్రాలుగా పనిచేస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క నాగర్‌కర్నూల్ నుంచి రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు బయలుదేరి మధ్యాహ్నం 2.30 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయానికి చేరుకోనున్నట్లు ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి తెలిపారు.

# గాంధీజీ ఆశయాలను కొనసాగిద్దాం వినో బాబావే ఇచ్చిన భూదాన భూములను కాపాడుదాం

**తెలంగాణ సర్వోదయ మండల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై గిరిప్రసాద్**




**పెన్ పవర్,**మహాసభలలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో భూదాను భూములు అక్రమాలకు,అన్యాక్రాంతం అవుతున్న వాటిని కాపాడుటకు గాంధీజీ చెప్పిన అహింస మార్గంలో, వినోబాబావే దానంగా స్వీకరించిన భూదాన భూముల ను కాపాడుకోవాలని అవి నిజమైన పేదవారికి చెందే విధంగా చూడాలని ఆ దిశగా నూతనంగా ఎన్నికయ్యే కమిటీ పనిచేయాలని అన్నారు.భూదాన భూములు అక్రమాలకు కారణం గాంధీ భవన్లో ఆంధ్ర ప్రదేశ్ భూధాన్ యాజ్ఞ బోర్డ్ పేరుపై మరోసారి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న భూదాన భూములు దగా చేస్తున్నారని ఆయన ఆరోపించారు.అనంతరం
మేడ్చల్ జిల్లా సర్వోదయ మండల్
జిల్లా నూతన కమిటీని సర్వోదయ మండల్ రాష్ట్ర అధ్యక్ష , కార్యదర్శులు ఆర్ శంకర్ నాయక్ ,వై గిరిప్రసాద్ ల సమక్షంలో ఎన్నుకోవడం జరిగింది. మేడ్చల్ జిల్లా సర్వోదయ మండల్ జిల్లా అధ్యక్షులుగా ఆదర్శ్,కార్యదర్శిగా దయానంద్,జిల్లా ప్రతినిధిగా తిక్కయ్య ఉపాధ్యక్షులు వెంకటయ్య, మహాకాళి బిక్షపతి, సహా కార్యదర్శిగా ఎస్ కృష్ణ , రాజేందర్ కోశాధికారిగా శివకుమార్, ప్రచార కార్యదర్శిగా పరశురాంలతో పాటు 5 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నుకోవడం జరిగింది.
సర్వోదయ మండల్ జిల్లా మహిళా సంఘాన్ని ఎన్నుకోవడం జరిగింది.జిల్లా అధ్యక్షురాలుగా అనంతలక్ష్మి, జిల్లా కార్యదర్శిగా మరియమ్మ, ఉపాధ్యక్షురాలు సునీత సహయ కార్యదర్శి విజయ కోశాధికారి అరుణ లను ఎన్నుకోవడం జరిగింది.సర్వోదయ మండల్ జిల్లా యువజన సంఘాన్ని ఎన్నుకోవడం జరిగింది. జిల్లా అధ్యక్షులుగా రాజ్ కుమార్, జిల్లా కార్యదర్శిగా కిరణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులుగా సహే కార్యదర్శిగా జగన్ యాదవ్ కోశాధికారిగా ఆర్ కే భూపాల్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# మాదిగ విద్యార్థిని విద్యార్థులు ఎస్సీ వర్గీకరణ ఫలాలను ఉపయోగించుకొని విద్యా ఉద్యోగాలలో రాణించాలీ



**పెన్ పవర్,**సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధనగర్ డివిజన్ అంబర్ నగర్ బస్తీలో గవర్నమెంట్ స్కూల్ లో మాదిగ విద్యార్థినులు విద్యార్థులు,యువతతో ఎం ఆర్ పి ఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమం ఎమ్మార్పీఎస్ , ఎం ఎస్ పి సికింద్రాబాద్ ఇంచార్జ్ డప్పు మల్లికార్జున్ మాదిగ సమన్వయం చేయగా..ముఖ్య అతిథులుగా హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ ఇంజం వెంకటస్వామి మాదిగ మరియు
ఎం ఎస్ ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జనపాల మహేష్ మాదిగ హాజరై మాట్లాడుతూ విద్యా ప్రాముఖ్యతను అందరూ గుర్తించాలని,సంపూర్ణ అక్షరాస్యత సాధించే విధంగా ప్రతి ఒక్కరు బాధ్యతతో చదువుతు బావి తరాలకు ఆదర్శంగా నిలవాలని విద్యార్థి,విద్యార్థులకు పిలుపు నివాడం జరిగింది,అలాగే డివిజన్ లో చదువులకు దూరమైన విద్యార్థులను తిరిగి చదువుకునేలా ప్రోత్సహించాలని కోరడం జరిగింది..ప్రస్తుతం కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న తల్లిదండ్రులు భవిష్యత్తులో తమ పిల్లలు కూలి పనులు చేసుకునే వారిగా మిగలకుండా చూసుకోవాలని , అందుకు తమ పిల్లలు ఉన్నత చదువులు చదువుతూ ప్రయోజకులుగా మారే విధంగా ఎం ఆర్ పి ఎస్ , ఎం ఎస్ పి నాయకులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరడం జరిగింది. అలాగే మాదిగ విద్యార్థిని విద్యార్థులు ఎస్సీ వర్గీకరణ ఫలాలను ఉపయోగించుకొని విద్యా ఉద్యోగాలలో రాణించాలని అదేవిధంగా జులై 7న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ జిల్లా అన్ని నియోజికవర్గా మరియు డివిజన్ బస్తీలలో ఎమ్మార్పీఎస్ జెండా గద్దెలను నిర్మాణం చేసుకొని పెద్ద ఎత్తున జెండావిష్కరణలు చేసుకోవాలని అలాగే ఎమ్మార్పీఎస్, అనుబంధసంఘాల నూతన కమిటీలు,మరియు మాదిగ విద్యార్థులను విద్యారంగంలో ఉద్యోగ రంగంలో రాణించే విధంగా మాదిగ విద్యార్థులను తయారు చేయాలన్ని పిలుపు నివడం జరిగింది.ఈ కార్యక్రమంలో సి,ప్రవల్లిక మాదిగ,సి అక్షయ మాదిగ, సి,భవ్య మాదిగ, చెరుకూరి జైవీర్ మాదిగ, సి,అంకిత మాదిగ, సి,హిందూ మాదిగ, పావని మాదిగ,సిద్ధార్థ్ మాదిగ,మైలారం లిఖిత శ్రీ మాదిగ,డప్పు వర్ష వర్ధిని మాదిగ, డప్పు అవంతిక మాదిగ, బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షులు చలగుడేమ్ దేవేందర్ మాదిగ. అడగుట్ట డివిజన్ ఇంచార్జ్ చెండేటి వేణుగోపాల్ మాదిగ. మెట్టుగూడ డివిజన్ అధ్యక్షులు ద్వ శివ ప్రసాద్ మాదిగ.తుమల శివ ప్రసాద్ మాదిగ,నాని మాదిగ ,యది మాల,డప్పు మహేష్ మాదిగ,తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ హనుమకొండ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగ మహోత్సవం



**పెన్ పవర్,**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వరంగల్, హన్మకొండ మరియు వరంగల్ , హన్మకొండ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా. మహోత్సవం
అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు వరంగల్, హన్మకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు మరియు ఇరుజిల్లాల బార్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో "అంతర్జాతీయ యోగా దినోత్సవం" నిర్వహించబడింది.
ఈ కార్యక్రమానికి ముఖ్య అథిదులుగు వరంగల్ మరియు హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు శ్రీమతి వి.బి.నిర్మల గీతాంబ మరియు మంత్రి రామకృష్ణ సునీత పాల్గొన్నారు. ఈ యోగా కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శులు , ఎ. ప్రదీప్, జి. రామలింగం , ఇరు జిల్లాల న్యాయమూర్తులు మరియు బార్ అసోసియేషన్ అధ్యక్షులు చకిలం ఉపేందర్, చొల్లేటి రామకృష్ణ, , సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
ఈ సందర్భంగా యోగా గురువు జితేంద్ర బృందం ఆధ్వర్యంలో వివిధ ఆసనాలు, శ్వాస పద్ధతులు ప్రదర్శించబడ్డాయి. వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మలా గీతాంబ మాట్లాడుతూ –– "యోగా మన మానసిక, శారీరక మరియు ఆధ్యాత్మిక అంశాలలో సామరస్యాన్ని ప్రోత్సహిస్తుంది. యోగా నిత్య ప్రక్రియ వల్ల మనం మన సాధారణ ఆరోగ్యం మరియు శక్తిని మెరుగుపరచుకోవచ్చు అని తెలిపారు.
హన్మకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మంత్రి రామకృష్ణ సునీత యోగా ప్రాముఖ్యతపై ప్రసంగించి, ఆరోగ్యపూరిత జీవనానికి యోగా అవసరమని స్పష్టం చేశారు. యోగా గురువులను జిల్లా ప్రధాన న్యాయమూర్తులు మరియు బార్ అసోసియేషన్ వారు శాలువాలతో సన్మానించారు.

# రోడ్డు ప్రమాదంలో యువతి మృతి..



**పెన్ పవర్,**హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదంలో యువతి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పెద్ద అంబర్‌పేట్ సాయినగర్ కాలనీకి చెందిన కొయ్యల ప్రత్యూష (20) వనస్థలిపురంలోని యూనిసెక్స్ సెలూన్‌లో బ్యూటీషియన్‌గా పనిచేస్తోంది. జూన్ 20 రాత్రి విధులు ముగించుకుని స్కూటీ (ఏపి29బిఎన్7372) పై ఇంటికి వెళ్తుండగా, హయత్‌నగర్ -- తొర్రూర్ రోడ్డులోని సాయిబాబా ఆలయం ఎదురుగా వినాయక్‌నగర్ కాలనీ వద్ద వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు (టీఎస్09జడ్7894) ఢీకొట్టింది. దీంతో ప్రత్యూష రోడ్డుపై పడిపోగా బస్సు ఆమెపై నుంచి వెళ్లినట్లు సమాచారం. ప్రమాదంలో ఆమె తలకు, ఎడమ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే హయత్‌నగర్‌లోని సన్‌రైజ్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదానికి ఆర్టీసీ బస్సు డ్రైవర్ జనికల వెంకటేశ్వర్లు నిర్లక్ష్యమే కారణమని మృతురాలి తండ్రి బాలయ్య ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రత్యూష తన తల్లిదండ్రులతో కలిసి నివసించేది. ఆమె తల్లిదండ్రులు స్థానిక పాఠశాల హాస్టల్‌లో వంట పనులు చేస్తున్నారు.

# పెద్దమ్మతల్లిని దర్శించుకున్న భక్తులు



పెన్ పవర్,:శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మగుడి) ఆదివారం సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో విచ్చేయడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుండే పరిసర గ్రామాల నుండే కాక జిల్లా నలుమూలల నుండేకాక ఇతర జిల్లాల నుండి భక్తులు అధికసంఖ్యలో విచ్చేసినారు. తమను చల్లంగా చూడాలని వేడుకుంటూ బోనాలు సమర్పించరు. దేవాలయ ఆవరణలోని శ్రీ అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారికి అభిషేకములు నిర్వహించారు. అన్నప్రాశనలు, వాహనపూజలు, తలనీలాలు, అమ్మవారికి ఒడిబియ్యం, చీరలు, కనుములు, తదితర మొక్కులను చెల్లించుకొని అమ్మవారిని, స్వామివారిని దర్శించుకొని తీర్ధప్రసాదములను స్వీకరించారు. భక్తులకు అవసరమైన ప్రత్యేక దర్శనమునకు క్యూలైన్లు, ఉచిత పులిహోర ప్రసాద వితరణ, మంచినీటి వసతి తదితర ఏర్పాట్లను దేవస్థాన కార్యనిర్వహణాధికారి విజయ్ కుమార్, సిబ్బంది పర్యవేక్షించరు.

# వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలుర పరిశీలక గృహంలో యోగా డే



**పెన్ పవర్,**వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి ఎ. ప్రదీప్ తేదీ: 21-06-2026 రోజున ఆటో నగర్ లోని బాలుర పరిశీలక గృహము లో యోగా డే ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ. ప్రదీప్ పాల్గొని, మాట్లాడుతూ "యోగా అనేది కేవలం కొన్ని శారీరక వ్యాయామాలు లేదా ఆసనాలు మాత్రమే కాదు. అది మన శరీరాన్ని, మనస్సును మరియు ఆలోచనలను ఒకే తాటిపైకి తెచ్చే ఒక గొప్ప సాధనం అని తెలిపారు. మానవ జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని, ఆందోళనలను దూరం చేసి, మనల్ని మానసికంగా ఎంతో బలంగా మార్చడానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుంది. మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడే మనం మంచి నిర్ణయాలు తీసుకోగలం. ప్రతిరోజూ ఉదయం కాసేపు ధ్యానం (వీవసఱ్ఞఅశీఅ) మరియు ప్రాణాయామం చేయడం వల్ల మీ ఏకాగ్రత పెరుగుతుంది. అది మీ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడానికి సహాయపడుతుంది అని తెలిపారు. ఇక్కడ ఉన్న సమయాన్ని మీరు ఒక క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అలవర్చుకోవడానికి ఉపయోగించుకోవాలని నేను కోరుకుంటున్నాను. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ మీ సంక్షేమం మరియు హక్కుల రక్షణ కోసం అండగా ఉంటుంది. మీకు ఎలాంటి చట్టపరమైన సహాయం కావాలన్నా, లేదా మీ సమస్యలను పంచుకోవాలన్నా మా సంస్థ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది అని వివరించారు. మిమ్మల్ని సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా మార్చడమే మా ముఖ్య ఉద్దేశం. ఈ రోజు నుండి మీరందరూ ప్రతిరోజూ కనీసం 15 నుండి 20 నిమిషాలు యోగా సాధన చేస్తారని ప్రతిజ్ఞ చేయాలని కోరారు. ఆరోగ్యకరమైన శరీరం మరియు ప్రశాంతమైన మనస్సుతో మీరు మీ జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాలి. ఈ
కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయమూర్తులు రితిక నందికొండ, చంద్ర ప్రసన్న మరియు రాజ్ నిధి పాల్గొని వారితో యోగా చేశారు.హోమ్ సూపరింటెండెంట్ శ్రీ దేవి, హోమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యోగా భారతదేశ ప్రాచీన జీవన విధానం: ప్రిన్సిపల్ మాధవి..

**బ్లూ బెల్ ఉన్నత పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం..**

**పెన్ పవర్,**యోగా భారతదేశానికి చెందిన ప్రాచీన జీవన విధానమని ప్రిన్సిపల్ మాధవి పేర్కొన్నారు. ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్‌లోని బ్లూ బెల్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ రాంబాబు, ప్రిన్సిపాల్ మాధవి, శ్రీ చైతన్య ఇన్ఫినిటీ అకాడమీ డైరెక్టర్ కృష్ణారావు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతను వివరిస్తూ భుజంగాసనం, వజ్రాసనం, పద్మాసనం, వీరభద్రాసనం, వృక్షాసనం, తాడాసనం, అష్టాంగాసనం, పర్వతాసనం వంటి వివిధ యోగాసనాలతో పాటు సూర్యనమస్కారాలను కూడా అభ్యసింపజేశారు. యోగాసనాల వల్ల శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని నిర్వాహకులు వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాధవి మాట్లాడుతూ, యోగా భారతదేశానికి చెందిన ప్రాచీన జీవన విధానమని, పూర్వకాలం నుంచి అనేక ఆరోగ్య సమస్యలను యోగా సాధన ద్వారా అధిగమించేవారని తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజూ సూర్యనమస్కారాలు, యోగాసనాలను క్రమం తప్పకుండా చేయడం ద్వారా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండగలరని చెప్పారు. యోగా క్రమశిక్షణ, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయ బృందం కూడా విద్యార్థులతో కలిసి వివిధ యోగాసనాలు, సూర్యనమస్కారాలను నిర్వహించి యోగా పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో సాగి, విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిపై చైతన్యాన్ని పెంపొందించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఖాదర్ బాషా, జోష్ణ, చంద్రకాంత్, మోనా, గాయత్రి, భాస్కర్, పీఈటీ రహమత్ తదితరులు పాల్గొన్నారు.









# రోటరీ క్లబ్ చేయూత చక్రాలు పంపిణీ కార్యక్రమం.

- చిలకలూరిపేట రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం మోహన్ ఆధ్వర్యంలో..







**పెన్ పవర్,** పల్నాడు జిల్లా చిలకలూరిపేట రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం మోహన్ ఆధ్వర్యంలో.. ఈరోజు అనగా ఆదివారం చిలకలూరిపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రోటరీ చేయూత చక్రాలు (తోపుడు బండ్లు) పంపిణీ కార్యక్రమం లో బేడ బుడగ జంగం చిలకలూరిపేట పట్టణ యువజన అధ్యక్షులు రేవల్లి రాజు సమక్షంలో కొంతమంది పేదవాళ్ళకు తోపుడు బండ్లు పంపిణీ చేయడం జరిగినది. రోటరీ క్లబ్ పండరీపురం మోహన్ మాట్లాడుతూ.. పేదవాళ్ళు వారి స్వశక్తితో ఎదగడానికి వారి అభివృద్ధికి తోడ్పాటునందిస్తాయని తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. అదేవిధంగా చిలకలూరిపేట పట్టణ బేడ బుడగ జంగం యువజన అధ్యక్షులు రేవల్లి రాజు మాట్లాడుతూ.. చిలకలూరిపేట రోటరీ క్లబ్ పండరీపురం మోహన్ సహకారంతో పేదవాళ్లకు గత 2020వ సంవత్సరం నుండి అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ వారి అభివృద్ధికి తోడుగా ఉంటూ వారికి సహాయం కల్పించే విధంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నందుకు ఆనందంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేవల్లి రాజు సమక్షంలో ఏడు మంది తోపుడు బండ్లు లబ్ధి పొందారు. వారి పేర్లు కళ్లెం బిక్షపతి , చిరుపాటి లింగమ్మ , రేవల్లి సీనమ్మ , కె. ఏడుకొండలు , నరసమ్మ , సిహెచ్ పార్వతి , బి. సరోజిని తదితరులు పాల్గొన్నారు.

# మొహరం పండుగ త్యాగానికి, సత్యానికి నిదర్శనం

- ప్రత్యేక ప్రార్థనలతో సమాజంలో శాంతి సౌభాగ్యాలు వికసిస్తాయి
- మతసామరస్యానికి ప్రతీకగా మొహరం వేడుకలు నిలుస్తాయి
- పవిత్రమైన రోజుల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించాలి
- ప్రతి ఒక్కరూ సోదరభావంతో పండుగను జరుపుకోవాలి
- ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుంది
- సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా
- పాతకొత్తగూడెంలోని హజరత్ అలీ అబ్బాస్ ఆషూర్ కనాను సందర్శించిన సాబీర్ పాషా




**పెన్ పవర్,:** మొహరం పండుగ త్యాగానికి, సత్యానికి నిదర్శనమని, ఈ పండుగ విశిష్టతను ప్రతి ఒక్కరూ చాటిచెప్పాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. ఈ నెల 26న జరగనున్న మొహరం పండుగను పురస్కరించుకుని జరుగుతున్న ప్రత్యేక కార్యక్రమాలు, పూజా కార్యక్రమాల నేపథ్యంలో ఆదివారం పాతకొత్తగూడెంలోని హజరత్ అలీ అబ్బాస్ ఆషూర్ కనాను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ... మొహరం పండుగ రోజుల్లో నిర్వహించే ప్రత్యేక పూజల వల్ల సమాజంలో శాంతి సౌభాగ్యాలు వికసిస్తాయని, లోకకల్యాణం జరుగుతుందని ఆకాంక్షించారు. ఈ వేడుకలు గంగా-జమునా తెహజీబ్‌కు, మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. పవిత్రమైన ఈ రోజుల్లో భక్తులందరూ భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని, ప్రతి ఒక్కరూ సోదరభావంతో పండుగను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇలాంటి ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి మానవుడికి మానసిక ప్రశాంతత లభిస్తుందని, సమాజంలో ఐక్యత పెరుగుతుందని వివరించారు. ఆషూర్ కనా కమిటీ నిర్వాహకులు చేస్తున్న ఏర్పాట్లను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. కార్యక్రమంలో నయీమ్ ఖురేషి, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, పడాల భవాని, రామారావు, సాంబిరెడ్డి, ఇమ్రాన్, జమాలుద్దీన్, మొహమ్మద్ అలీ, జడల అరుణ తదితరులు పాల్గొన్నారు.

# 14 ఏళ్ల అభివృద్ధిపై చర్చకు రండి: కిషన్ రెడ్డికి కాంగ్రెస్ నేతల సవాల్..



**పెన్ పవర్,** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 14 ఏళ్లపాటు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి చేసిన అభివృద్ధి, గత రెండున్నరేళ్లలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ నాయకులు సవాల్ విసిరారు. రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు మానుకోవాలని, ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలు ఇక సాగవని హెచ్చరించారు. అదివారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెదిరె హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, రాచర్ల వెంకటేశ్వర్లు, జడల రవీందర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, ఎడ్మ నరేందర్‌రెడ్డి, లింగం ముదిరాజ్, గౌస్ పాషా తదితరులు మాట్లాడారు. రైతుల సమస్యలపై కిషన్ రెడ్డి మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రుణమాఫీ, ధాన్యం కొనుగోలు వ్యవహారాలు ఎలా జరిగాయో ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేసిందని, ధాన్యం కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 72 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని చెప్పారు.

రైతుబంధు పేరిట గతంలో వ్యాపారవేత్తలకు లబ్ధి చేకూరిందని, ప్రస్తుతం నిజమైన రైతులను గుర్తించి రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందిస్తున్నామని పేర్కొన్నారు.

సీఎంతో నేరుగా అనుసంధానం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కలవలేదంటూ చేస్తున్న విమర్శలు అవాస్తవమన్నారు. గతంలో ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కూడా దొరకని పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం సీఎం ఒక్క ఫోన్ కాల్ దూరంలో ఉన్నారని చెప్పారు. కేవలం 15 రోజుల్లో నాలుగు సార్లు సీఎంను నియోజకవర్గానికి తీసుకువచ్చిన ఘనత రంగారెడ్డిదేనని పేర్కొన్నారు.

ఆరుట్ల స్కూల్‌పై విమర్శలు తగవు

ఆరుట్ల ప్రభుత్వ పాఠశాలను ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దుతున్న నేపథ్యంలో కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కిషన్ రెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి పాఠశాలను సందర్శిస్తే అక్కడ జరిగిన మార్పులు స్పష్టంగా కనిపిస్తాయని అన్నారు. పేద పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలను కూడా రాజకీయ రంగు పులుమడం సరికాదని వ్యాఖ్యానించారు.

అభివృద్ధి అడ్డుకుంటే ప్రజలే బుద్ధి చెబుతారు

ఫార్మాసిటీ స్థానంలో ఫ్యూచర్ సిటీ నిర్మాణం ద్వారా ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుంటే, మళ్లీ పాత విధానాలనే ప్రస్తావించడం ఆశ్చర్యకరమన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కనిపించకపోతే చెరువుకట్టపై నుంచి రోజూ వెళ్లే కిషన్ రెడ్డి ప్రజలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఇదే విధంగా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు కొనసాగిస్తే వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు.

ముందుగా టికెట్ విషయం తేల్చుకోండి

పదేళ్ల పాలనలో నియోజకవర్గాన్ని వెనక్కి నెట్టారని ప్రజలే తీర్పు చెప్పి 40 వేల ఓట్ల మెజార్టీతో మల్‌రెడ్డి రంగారెడ్డిని గెలిపించారని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపితే పలువురు నాయకులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. ఉనికి కోసం ఆరోపణలు చేస్తున్న కిషన్ రెడ్డి ముందుగా తన కుటుంబంలో టికెట్ ఎవరికి వస్తుందో తేల్చుకుని తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లాడాలని సూచించారు.

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిపై నిరాధార ఆరోపణలు చేస్తే ఇకపై సహించబోమని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు.

# యోగ ద్వారా ఆరోగ్యమైన జీవన విధానం



**పెన్ పవర్,** మహబూబాబాద్ జిల్లా బయ్యారం:...బయ్యారం మండలం జగ్గుతండ గ్రామపంచాయతీలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలోని యునాని వైద్యాధికారి డాక్టర్ శంకర్ నాయక్,యోగ ట్రైనర్ ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.యోగా ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా జగ్గుతండ సర్పంచ్ బొల్లి జయంతి వేంకట కృష్ణ,బయ్యారం సర్పంచ్ శాంతి కిషన్ నాయక్ మాట్లాడుతూ యోగను భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరమని,ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగను భాగం చేసుకుంటే శారీరక,మానసిక ఆరోగ్యంతో పాటు ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుందని వారు తెలిపారు.డాక్టర్ శంకర్ మాట్లాడుతూ నేటి ఒత్తిడి జీవనశైలిలో యోగ ఉత్తమ పరిష్కార మార్గమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ కుమార్,మాజీ ఎంపిపి కిషన్ నాయక్,కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ నీలిమ,ఏఎన్ఎం సమ్మక్క,ఆశా కార్యకర్తలు,బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం 500 బోనస్ అమలు చేసే 7 రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి

మండల వ్యవసాయ అధికారి కే.రాజు



**పెన్ పవర్,**.బయ్యారం మండలంలోని రైతులకు నాణ్యమైన విత్తనాలు,పప్పుధాన్యాల విత్తనాలు,ఆధునిక ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించుటకు విత్తన మేళా కార్యక్రమాన్ని ఈ నెల 23 నుండి బయ్యారం,కొత్తపేట, రామచంద్రాపురం రైతు వేదికల్లో నిర్వహించబడుతుందని మండల వ్యవసాయ అధికారి కే.రాజు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ విత్తన మేళాలో ప్రభుత్వం 500 రూపాయల బోనస్ అమలు చేసే 7 వరి విత్తనాలు అందుబాటులో ఉంటాయని, విత్తనాలు అవసరమైన రైతులు కొనుగోలు చెయ్యొచ్చున్నారు.బీపీటీ 5204,ఎచ్ఎంటీ సోనా,జై శ్రీరామ్,కేఎన్ఎం 1638,ఆర్ఎన్ఆర్ 15048,డబ్ల్యూజిఎల్ 44,కేఎన్ఎం 7715 వీటితో పాటు వివిధ రకాల పప్పుధాన్యాల,అప్పరాలు,కురయగాలు విత్తనాలు,నానో యూరియా,నానో డీఏపీ తదితర వ్యవసాయ ఉత్పత్తులు కూడా రైతులకు అందుబాటులో ఉంటాయన్నారు.

ప్రజా ప్రతినిధులు,వ్యవసాయ శాఖ అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించబడునని తెలిపారు.కావున రైతు సోదరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విత్తన మేళాకు హాజరై అవసరమైన విత్తనాలను,వ్యవసాయ ఉత్పత్తులను పొందాలని రైతులను కోరారు.

# వ్యవసాయ కూలీలను, కౌలు రైతులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు....

ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి గుజ్జు దేవేందర్




**పెన్ పవర్,**..వ్యవసాయ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు ప్రభుత్వాల నిరాదరణకు గురవుతున్నారని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్)జిల్లా కార్యదర్శి గుజ్జు దేవేందర్ అన్నారు. బయ్యారం గడ్డం వెంకట్రామయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఏఐకేఎంఎస్ మండల మహాసభలో ఆయన ప్రసంగిస్తూ అనేక ప్రయాసలు కోర్చి వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడులను గణనీయంగా పెంచడంలో వ్యవసాయ కూలీలు కౌలు రైతుల పాత్ర విస్మరించలేనిదని ఆయన అన్నారు. స్వాతంత్ర స్వర్ణోత్సవ సంబరాలు చేసుకున్న తర్వాత కూడా వారి పరిస్థితి దయనీయంగా ఉందని, వ్యవసాయ రంగాన్ని విస్మరిస్తున్న పాలకు కౌలు రైతులు వ్యవసాయ కూలీలకు ఆరకర సౌకర్యాలు కల్పించటానికి కూడా సిద్ధంగా లేరని అన్నారు. వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం చేయాలని ఎన్నో ఆందోళనలు జరిగినప్పటికీ ప్రభుత్వాలు స్పందించడం లేదని అన్నారు. నేడు రైతు భరోసా, రైతు భీమా లాంటి పథకాలు కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు అందడం లేదని, 2011లో చేసిన కౌలు రైతుల గుర్తింపు చట్టం కూడా అమలుకు నోచుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం చేయాలని వారిని అన్ని రకాలుగా ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగాన్ని రక్షించుకోవడం కోసం ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని, అందుకు రైతు కూలీలు ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. మహాసభ ప్రారంభానికి ముందు ఏఐకేఎంఎస్ జెండాను సంఘం మండల అధ్యక్షులు రామగిరి బిక్షం ఆవిష్కరించారు. అనంతరం రామగిరి బిక్షం పూనెం భిక్షం, భానోతు నరసింహాలతో కూడిన అధ్యక్ష వర్గం మహాసభను నిర్వహించగా ఈ సభలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు జడ సత్యనారాయణ, నందగిరి వెంకటేశ్వర్లు, మోకాళ్ళ మురళీకృష్ణ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య తదితరులు ప్రసంగించారు. అనంతరం మహాసభ బానోతు నరసింహ అధ్యక్షులుగా తోకల వెంకన్న కార్యదర్శిగా 21 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సభలో జిల్లా నాయకులు మైల యాకన్న, మెంగు భగవాన్, గుండె బోయిన లింగమల్లు, మేకపోతుల నాగేశ్వరరావు,పూనెం లింగన్న, గంగారపు బిక్షం,సూర్నబాక రాంబాబు, మోకాళ్ళ రమేష్,తుడుం వీరభద్రం,నేతకాని రాకేష్,సజ్జ జలంధర్, తోటకూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు..

# నీట్-2026 పరీక్షల సందర్భంగా మట్వాడ పోలీసుల సమర్థవంతమైన బందోబస్తు

**పెన్ పవర్,** చీజుజు-2026 ప్రవేశ పరీక్షల సందర్భంగా మట్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. పోలీసు అధికారులు, సిబ్బంది విధి పట్ల అంకితభావంతో వ్యవహరిస్తూ పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించారు. విద్యార్థులు ఎలాంటి భయం, ఆందోళన లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలకు హాజరయ్యేలా ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, కేంద్రాల వద్ద క్రమశిక్షణను సమర్థవంతంగా నిర్వహించారు. పరీక్షలకు వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ పోలీసు సిబ్బంది సేవాభావాన్ని చాటుకున్నారు.




# నిషేధిత బీటీ 3 పై ఉక్కుపాదం



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో బీటీ 3 విత్తనాల వాడకం పై నిషేధం ఉందని, నిషేధిత బీటీ 3 విత్తనాలు విక్రయించినా, వేసినా నేరమేనని మరిపెడ ఎస్హెచ్ వో గంద్రాతి సతీష్, ఏవో వీరాసింగ్ హెచ్చరించారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని గుండెపుడి గ్రామంలో పోలీసులు, వ్యవసాయ అధికారులు జిల్లా ఎస్పీ శబరీష ఆదేశానుసారం సీఐ పవన్ కుమార్ నేతృత్వంలో సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురి ఇండ్లు, వ్యవసాయ క్షేత్రాల నుంచి ప్రభుత్వం నిషేధించిన సుమారు 12 కేజీలు రూ.26 వేలు విలువ చేసే బీటీ 3 విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బీటీ 3 అనేది పర్యావరణానికి మానావాళి మనుగడకు ప్రమాదమని, తెలంగాణలో ఈ రకం విత్తనాలు నిషేదమన్నారు. ఈ విత్తనాలు కొనుగోలు చేసి నాటినా కూడా అనుమానం కలిగిన పంటకు డీఎన్ఏ టెస్టు నిర్వహించి బీటీ 3 అని తేలితే పంట తొలగించటం జరుగుతుందని హెచ్చరించారు. గుండెపుడి గ్రామంతో పాటుగా చుట్టు ప్రక్కల మండలాలు, ఆంధ్రా నుంచి వచ్చే ప్రతి విత్తనాల పై ప్రత్యేక నిఘా ఉంచామని, గత కొన్నేళ్లుగా జరుగుతున్న ఈ నిషేధిత దందా పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుందన్నారు. ఈ సెర్చ్ లో ఎస్ఐలు గంద్ర సంతోష్ కుమార్, మహబూబ్ బీ, హెడ్ కానిస్టేబుల్ బలరాం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్య సమస్యలున్నాయా?..
# ఈ ఆసనాలతో జాగ్రత్త!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ ఏడాది 'ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా' అనే థీమ్‌తో ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది యోగా మ్యాట్లపైకి చేరుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా జనాభాలో వృద్ధుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఆధునిక జీవనశైలిలో యోగా ఒక ముఖ్యమైన భాగంగా మారింది. దీర్ఘకాలిక ఒత్తిడిని తగ్గించడం, ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచడం, కండరాల వశ్యతను మెరుగుపరచడం వంటి ప్రయోజనాల వల్ల ఆరోగ్య నిపుణులు, ఫిట్‌నెస్ ప్రియులు యోగాకు ప్రాధాన్యత ఇస్తున్నారు.అయితే, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు, వాణిజ్యపరమైన ప్రకటనల వెనుక ఒక కీలకమైన వైద్య వాస్తవాన్ని చాలామంది విస్మరిస్తున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. యోగా అనేది అందరికీ ఒకేలా సరిపోయే వ్యాయామం కాదని, దానిని ఒక ప్రదర్శనగా కాకుండా శాస్త్రంగా చూడాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు యోగా చేసేటప్పుడు అత్యంత జాగ్రత్తగా ఉండాలి. లేదంటే ఆరోగ్యం కోసం చేసే సాధన అనారోగ్యానికి దారితీసే ప్రమాదం ఉంది.

**కొన్ని ఆరోగ్య సమస్యలున్నవారు పాటించాల్సిన జాగ్రత్తలు:**

**1. రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు**

అధిక రక్తపోటు, అరిథ్మియా (గుండె లయ తప్పడం) లేదా ఇతర గుండె సమస్యలతో బాధపడేవారు తలకిందులుగా చేసే ఆసనాలు, వేగవంతమైన యోగా విన్యాసాల విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలి. శీర్షాసనం (హెడ్‌స్టాండ్), సర్వాంగాసనం (షోల్డర్ స్టాండ్) వంటి ఆసనాలు వేసినప్పుడు రక్తం వేగంగా తల, ఛాతీ వైపు ప్రవహిస్తుంది. దీనివల్ల గుండెపై అదనపు భారం పడి, రక్తపోటు ఒక్కసారిగా పెరిగే ప్రమాదం ఉంది. ఇది గుండెకు తీవ్రమైన ఒత్తిడిని కలిగిస్తుంది.

చేయకూడనివి: కాళ్లు, తల, గుండె కంటే ఎత్తులో ఉండే పూర్తి ఇన్వర్షన్ ఆసనాలు.

సురక్షితమైన ప్రత్యామ్నాయం: వెల్లకిలా పడుకుని, నడుము కింద ఒక యోగా బ్లాక్ సహాయంతో చేసే సేతు బంధ సర్వాంగాసనం (బ్రిడ్జ్ పోజ్) సురక్షితం. ఈ ఆసనంలో తల, గుండె ఒకే స్థాయిలో ఉండటం వల్ల రక్తపోటుపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదు.

**2. తీవ్రమైన ఆస్టియోపొరోసిస్, వెన్నెముక సమస్యలు**

ఎముకల సాంద్రతను, శరీర సమతుల్యతను మెరుగుపరచడానికి యోగా సహాయపడుతుందని చెబుతారు. అయితే, ఎముకలు బలహీనంగా ఉన్నవారు, వెన్నెముక డిస్క్ సమస్యలు (హెర్నియేటెడ్ డిస్క్) ఉన్నవారు బలవంతంగా చేసే ఆసనాల వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ముఖ్యంగా ముందుకు ఎక్కువగా వంగడం, వెన్నెముకను అతిగా తిప్పడం వంటివి వెన్నుపూసలపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తాయి. మాయో క్లినిక్ ప్రొసీడింగ్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం, ఆస్టియోపొరోసిస్ ఉన్నవారు బలవంతంగా ముందుకు వంగే ఆసనాలు చేయడం వల్ల వెన్నుపూస ఫ్రాక్చర్లు అయ్యే ప్రమాదం ఉందని తేలింది.

చేయకూడనివి: పశ్చిమోత్తానాసనం (సీటెడ్ ఫార్వర్డ్ బెండ్), హలాసనం (ప్లౌ పోజ్) వంటి వెన్నెముకను గుండ్రంగా మార్చే ఆసనాలు.

సురక్షితమైన ప్రత్యామ్నాయం: ముందుకు వంగేటప్పుడు వెన్నెముకను నిటారుగా ఉంచాలి. నడుము నుంచి కాకుండా, తుంటి కీళ్ల నుంచి వంగే ప్రయత్నం చేయాలి. యోగా స్ట్రాప్స్ సహాయంతో పాదాలను పట్టుకుని, వెన్నెముకపై ఒత్తిడి పడకుండా చూసుకోవాలి.

**3. గ్లాకోమా, ఇతర కంటి సమస్యలు**

గ్లాకోమా అనేది కంటిలో ద్రవ ఒత్తిడి (ఇంట్రాక్యులర్ ప్రెజర్ - ఐఓపి) పెరగడం వల్ల వచ్చే సమస్య. ఇది క్రమంగా కంటి నరాన్ని దెబ్బతీసి, శాశ్వత అంధత్వానికి దారితీయవచ్చు. శరీరాన్ని తలకిందులుగా చేసినప్పుడు, తల భాగంలో రక్త ప్రసరణ పెరిగి కంటిపై ఒత్తిడి పెరుగుతుంది. గ్లాకోమా రోగులకు ఇది చాలా ప్రమాదకరం.

చేయకూడనివి: అధో ముఖ శ్వానాసనం (డౌన్‌వర్డ్-ఫేసింగ్ డాగ్), ఉత్తానాసనం (స్టాండింగ్ ఫార్వర్డ్ ఫోల్డ్) వంటి ఆసనాలను ఎక్కువసేపు చేయడం.

సురక్షితమైన ప్రత్యామ్నాయం: డౌన్‌వర్డ్-ఫేసింగ్ డాగ్ ఆసనానికి బదులుగా, చేతులను గోడకు ఆనించి శరీరంతో 'ఎల్' ఆకారం సృష్టించాలి. దీనివల్ల తల, గుండె కంటే పైస్థాయిలోనే ఉండి కంటిపై ఒత్తిడి పడదు.

ఆరోగ్యకరమైన జీవనానికి యోగా ఒక శక్తివంతమైన సాధనం. అయితే, దానిని ప్రదర్శనగా కాకుండా మన శరీరానికి అనుగుణంగా, ఒక శాస్త్రంగా అభ్యసించడం ముఖ్యం. ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే, యోగా ప్రారంభించే ముందు తప్పనిసరిగా మీ వైద్యుడిని సంప్రదించి, మీ యోగా శిక్షకులకు మీ ఆరోగ్య పరిస్థితిని స్పష్టంగా తెలియజేయడం శ్రేయస్కరం. అప్పుడే యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుంది.

## తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు పై త్వరలో నిర్ణయం : ఎమ్మెల్సీ కోదండరాం

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు అంశం పై త్వరలోనే స్పష్టమైన నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. జిల్లా కేంద్రంలో తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ జిల్లా స్థాయి సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యమకారుల సమస్యలు, విన్నపాలను గుర్తింపు కమిటీ దృష్టికి తీసుకెళ్లి తగిన నిర్ణయాలు తీసుకునేలా కృషి చేస్తానన్నారు. వేలాది మంది త్యాగాలు, బలిదానాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని పేర్కొంటూ, ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీల అమలులో జాప్యం జరగకూడదన్నారు. 1969 ఉద్యమం నుంచి రాష్ట్ర సాధన వరకు పోరాడిన ఉద్యమకారులకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలని కోరారు. ఉద్యమకారుల పై నమోదైన కేసుల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి

తీసుకుని జర్నలిస్టులను కూడా ఉద్యమకారులుగా గుర్తించే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ పై కొందరు పొరుగు రాష్ట్రాల నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఖండించిన కోదండరాం, ప్రజల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు మంచివి కావన్నారు. అలాగే గోదావరి, కృష్ణా జలాల పంపిణీ, పోతిరెడ్డిపాడు, పోలవరం వంటి అంశాల్లో తెలంగాణ హక్కులకు అనుగుణంగా న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ జేఏసీ కన్వీనర్ డోలి సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు అంబటి శ్రీనివాస్, పిల్లి సుధాకర్, శాంతన్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# భద్రాచలం ఏరియా ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీగా మార్చాలి : జవీకు జాన్ వెస్లీ లేఖ



**హైదరాబాద్ పెన్ పవర్:** నాలుగు రాష్ట్రాల సరిహద్దులోని పేదలు, ముఖ్యంగా గిరిజన (ఆదివాసీ) ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని.. సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. జూన్ 10న తేదీన తమ పార్టీ నాయకత్వంతో కలిసి భద్రాచలం ఆసుపత్రిని సందర్శించామని, ఆ సమయంలో మౌలిక, సిబ్బంది లోపాలను గమనించినట్టు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సరిహద్దుల్లోని దాదాపు 80 శాతం మంది ఆదివాసీలు ఈ ఆసుపత్రిపైనే ఆధారపడుతున్నారని, అయినా ఐటీడీఏ నిధులు దీనికి కేటాయించడం లేదని లేఖలో పేర్కొన్నారు.

**62 మంది డాక్టర్లకు 22 మందే!**

ఆసుపత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా ఉందని జాన్ వెస్లీ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తం 62 మంది డాక్టర్లు ఉండాల్సిన చోట కేవలం 22 మంది మాత్రమే విధుల్లో ఉన్నారని తెలిపారు. 16 మంది సివిల్ సర్జన్లకు గాను ముగ్గురే ఉన్నారని, 37 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లలో మెజారిటీ కాంట్రాక్ట్ వారేనని, అందులోనూ ఆరుగురు డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారని వివరించారు. ఆర్థోపెడిక్, పీడియాట్రిక్ (పిల్లల వైద్యం), ఈఎన్‌టీ విభాగాల్లో సగం మంది కూడా లేరని, ఆయుర్వేదం, హోమియో, జనరల్ మెడిసిన్, స్కిన్ విభాగాల్లో అసలు ఒక్క డాక్టర్ కూడా అందుబాటులో లేరని పేర్కొన్నారు.

**మూడు వార్డులకు ఒక్కరే నర్సు!**

వైద్యులతో పాటు నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది కొరత కూడా వేధిస్తోందని వెస్లీ తెలిపారు. 53 మంది నర్సింగ్ సిబ్బందికి కేవలం 28 మందే ఉన్నారని, చిల్డ్రన్స్ ఐసీయూలోనూ తీవ్ర కొరత ఉందన్నారు. ఒక్కో స్టాఫ్ నర్స్ ఏకంగా మూడు వార్డులను చూసుకోవాల్సి వస్తోందని, దీనివల్ల వారిపై తీవ్ర పని ఒత్తిడి పెరుగుతోందన్నారు. బ్లడ్ బ్యాంక్ నిర్వహణకు, రేడియాలజీ విభాగానికి అసలు టెక్నీషియన్లే లేరని స్పష్టం చేశారు. ఆసుపత్రిని శుభ్రంగా ఉంచే శానిటేషన్ వర్కర్లు 160 మంది ఉండాల్సి ఉంటే, కేవలం 85 మందితోనే సరిపెడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. పెరిగిన పనిభారానికి తగ్గట్టుగా కాకుండా వారికి కేవలం రూ.11 వేల కనీస వేతనం మాత్రమే ఇస్తున్నారని, వారికి కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదన్నారు.

**పడకల కొరత.. రిపేరులోనే అంబులెన్స్**

ఆసుపత్రి సామర్థ్యం 200 పడకలదే అయినప్పటికీ, నిత్యం 250 మందికి పైగా

రోగులు ఇక్కడ చికిత్స పొందుతున్నారని జాన్ వెస్లీ తెలిపారు. హాస్పిటల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ లేకపోవడం వల్ల రెండు అంబులెన్స్‌లలో ఒకటి గత రెండేళ్లుగా రిపేరులోనే మగ్గుతోందని సీఎం దృష్టికి తెచ్చారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని భద్రాచలం ఆసుపత్రిని తక్షణమే సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా మార్చాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న డాక్టర్, నర్సింగ్, టెక్నీషియన్ పోస్టులను భర్తీ చేయాలని, అత్యవసర మందులు, ఆధునిక యంత్రాలను సరఫరా చేయాలన్నారు. శానిటేషన్ వర్కర్లకు కనీస వేతనాలు పెంచడంతో పాటు, అత్యంత కీలకమైన అడ్వాన్స్ ట్రామా సెంటర్‌ను భద్రాచలంలో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు.

## కరీంనగర్‌లో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో మంటలు..
# డ్రైవర్ అప్రమత్తతో 41 మంది సేఫ్

- కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా దగ్ధమైన ఎలక్ట్రిక్ బస్సు
- షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని అంచనా
- డ్రైవర్ అప్రమత్తతతో సురక్షితంగా బయటపడ్డ 41 మంది ప్రయాణికులు
- నిమిషాల వ్యవధిలోనే పూర్తిగా కాలిపోయిన బస్సు



**హైదరాబాద్ పెన్ పవర్:** కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అయితే, డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో 41 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనతో పెను ప్రమాదం తప్పినట్లయింది.

వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు ఇవాళ ఉదయం 41 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. బస్సు అలుగునూరు దాటి కాకతీయ కాలువ సమీపానికి చేరుకోగానే ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. వెంటనే గమనించిన డ్రైవర్ ప్రశాంత్, బస్సును రోడ్డు పక్కన ఆపివేశారు. క్షణాల్లోనే ఆయన బస్సు డోర్‌తో పాటు ఎమర్జెన్సీ ద్వారాన్ని కూడా తెరిచి ప్రయాణికులందరినీ కిందకు దింపేశారు. ప్రయాణికులు కిందకు దిగిన నిమిషాల వ్యవధిలోనే బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులతో పాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ అప్రమత్తత వల్లే పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులు తెలిపారు.

## జర్మనీ టూర్‌కు 35 మంది విద్యాశాఖ అధికారుల బృందం.. సభ్యుల ఎంపికపై వివాదం..?

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యా ప్రమాణాలను పెంచే లక్ష్యంతో, అంతర్జాతీయ బోధనా పద్ధతులను పరిశీలించేందుకు ఈ నెల 28 న 35 మంది తో కూడిన విద్యాశాఖ అధికారుల బృందం జర్మనీ వెళ్లనుంది. అందులో సాంకేతిక విద్యాశాఖ నుంచి 7 గురు సభ్యులను ఎంపిక చేశారు. ఇదే విషయమై ఇటీవల ఆ శాఖలో అంతర్గతంగా చర్చ నడుస్తోంది. 7 గురు సభ్యుల్లో ముగ్గురు అనర్హులను ఎంపిక చేశారంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 28వ తేదీన జర్మనీ దేశ పర్యటనకు వెళ్లనున్న అధికారుల బృందం అంతర్జాతీయంగా సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను అధ్యయనం చేయనున్నారు. రిటైర్ అయిన ఇంగ్లీష్ లెక్చరర్ ఏ విధంగా తెలంగాణ సాంకేతిక విద్య విభాగానికి సేవలందిస్తారో అర్థం కావడం లేదని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ విధంగా ఎస్బీటెట్ నిధులు దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఇదివరకు ఫిన్లాండ్ టూర్ కు పంపిన వారిలో అనర్హులే ఉన్నారని, వారు ఇప్పటివరకు కూడా టూర్లో అధ్యయనం చేసిన విషయాలను బోర్డులో కనీసం చర్చించలేదని తెలుస్తోంది.

**ప్రధాన రంగాలపై పరిశోధన:**

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ టీచర్లను విదేశాలకు పంపించి అక్కడి విద్యా విధానాలను అధ్యయనం చేయాలని సూచించింది. ఇతర దేశాల్లో విద్యా ప్రమాణాలను అధ్యయనం చేసి, ఆ స్థాయి విద్యను మన రాష్ట్రంలో ప్రవేశపెట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో ఒత్తిడిలేని చదువు అందించడంలో పేరు పొందిన ఫిన్లాండ్ తో పాటు అమెరికా, యూకే, సింగపూర్ తదితర దేశాలకు పంపాలని నిర్ణయించింది. ఈ నెల 28 న ప్రపంచవ్యాప్తంగా అగ్రగామిగా ఉన్న జర్మనీ సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశీలించేందుకు ఈ పర్యటన కు అధికారులు వెళ్లనున్నారు. ముఖ్యంగా టెక్నాలజీ, ఆటోమొబైల్, మెకానికల్, ఐటీ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) వంటి కీలక రంగాలపై ఈ బృందం ప్రత్యేకంగా పరిశోధన చేయనుంది. అక్కడి విద్యా విధానాలు, పారిశ్రామిక నైపుణ్యాలను మన సాంకేతిక విద్యా విభాగంలో ఎలా అమలు చేయాలనే అంశాలపై ఈ బృందం అధ్యయనం చేయనుంది. ఈ టూర్ లో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఏ. దేవసేనలు కూడా ఉన్నారు.

**సభ్యుల ఎంపికపై విమర్శలు:**

అయితే, అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ విదేశీ పర్యటన కోసం అధికారుల ఎంపిక ఇప్పుడు విమర్శలకు దారి తీసింది. ఈ టూర్ కోసం సాంకేతిక విద్యాశాఖ నుంచి ఎంపికైన మొత్తం ఏడుగురిలో, ముగ్గురు అధికారులకు అర్హత లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అందులో ఒకరు రిటైర్డ్ ఇంగ్లీష్ లెక్చరర్,

ఫిజిక్స్ హెడ్, సివిల్ వాళ్లు ఇద్దరు, డిప్యూటీ డైరెక్టర్, ఎలక్ట్రికల్స్ డిపార్ట్‌మెంట్ నుండి ఎంపిక చేశారు. సంబంధిత రంగాలపై కనీస అవగాహన, అర్హత లేని వారిని ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారంటూ శాఖలోని ఇతర అధికారులు, ఉద్యోగ సంఘాలు మండి పడుతున్నాయి. జర్మనీలో టెక్నికల్ ఎడ్యుకేషన్ లో అమలవుతున్న విధివిధానాలు పరిశీలించడంలో సంబంధిత సబ్జెక్టు నిపుణులు తప్పకుండా ఉండాలి. కానీ అర్హులైన నిపుణులను పక్కనబెట్టి, లూప్‌హోల్స్ ద్వారా ఈ ముగ్గురిని చేర్చడం వెనుక ఉన్న అంతర్యమేమిటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

# జగన్ న్యూ మూవ్... కాపు నేతలకు ఫ్రీ హ్యాండ్



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీలో ఉన్న కాపు నేతలు ఇపుడు కీలకం అయ్యారు. 2029 ఎన్నికల్లో వైసీపీని గెలిపించాలి అంటే ఏపీలో బలమైన్ కాపు సామాజిక వర్గాన్ని తమ వైపు తిప్పుకోవాల్సిన అవసరం ఉందని వైసీపీ హైకమాండ్ భావిస్తోంది. 2024 ఎన్నికల్లో కాపులను పవన్ ఆసరాతో తమ వైపు తిప్పుకున్న టీడీపీకి అదే అస్త్రంతో తిప్పు కొట్టాలని వైసీపీ నిర్ణయించింది. ఈ క్రమంలో కాపులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చింది. ఒక ప్రాంతీయ పార్టీలో ఒక సామాజిక వర్గం నేతలు అంతా ఒక చోట సమావేశం అయి తీర్మానాలు చేయడం అన్నది అరుదైన సందర్భం. ఇది జాతీయ పార్టీ కాంగ్రెస్ లోనే జరుగుతుంది. కానీ వైసీపీ ఇపుడు కాపులకి అటువంటి అవకాశం ఇచ్చింది. కోస్తా జిల్లాలలో బలంగా ఉన్న కాపు సామాజిక వర్గాన్ని ఏకత్రాటిపైకి తీసుకుని వచ్చే బాధ్యతను వైసీపీ కాపు నేతల మీద వైసీపీ హైకమాండ్ పెట్టింది.

**తొలి సమావేశంతోనే :**

ఇదిలా ఉంటే కాపుల తొలి సమావేశం గోదావరి జిల్లాలకు గుండె కాయ లాంటి కోన సీమ జిల్లా వెంకటాపురంలో జరిగింది. ఈ సమావేశానికి శ్రీకాకుళం జిల్లా నుంచి అనంతపురం జిల్లా దాకా ఉన్న వైసీపీ కాపు నేతలు అంతా హాజరు కావడం విశేషం. వీరంతా ఈ సమావేశంలో అనేక అంశాలను చర్చించినట్లుగా చెబుతున్నారు. కూటమి ప్రభుత్వంలో తమ సామాజిక వర్గం స్థితిగతులు అలాగే ఏపీలో సామాజికంగా రాజకీయంగా కాపుల పరిస్థితులు చర్చించినట్లుగా చెబుతున్నారు. కూటమి ప్రభుత్వంలో కాపులకు అన్యాయం జరుగుతోందని దానిని హైలెట్ చేస్తూ జనంలోకి వెళ్లాలని కూడా కాపు నేతలు ఆలోచిస్తున్నట్లుగా చెబుతున్నారు.

**బొత్స కీలక వ్యాఖ్యలు :**

ఇక కాపు సమావేశానికి హాజరైన ఉత్తరాంధ్రా వైసీపీ సీనియర్ నేత మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ ఎవరితో అధికారంలోకి తీసుకుని రావడానికి తాము సమావేశాలు పెట్టుకోమని చెప్పడం విశేషం. అంతే కాదు తాము కాపుల కోసం వారి సమస్యల మీద చర్చించడానికే సమావేశం అయ్యామని చెప్పారు. కూటమి పార్టీలు ఎన్నికల వేళ కాపు కార్పోరేషన్ ని ఏర్పాటు చేసి మూడు వేల కోట్ల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చాయని ఆ హామీల గురించి కూడా చర్చించామని బొత్స చెప్పారు. ఇక వైసీపీ హయాంలో కాపు నేస్తం పేరుతో తాము ఆర్ధికంగా నిధులు ఇచ్చామని బొత్స చెప్పుకొచ్చారు.

**వరుస భేటీలతో :**

ఇదిలా ఉండగా వెంకటాపురంలో జరిగిన సమావేశం మొదటిది అని దీని తరువాత మరిన్ని సమావేశాలు ఏపీలో పలు చోట్ల నిర్వహించాలని కాపు నేతల సమావేశం నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. రానున్న రోజులలో వైసీపీలో పేరున్న నోరున్న కాపు నేతలు అంతా రాష్ట్రవ్యాప్త పర్యటనలు చేయాలని కూడా నిర్ణయించినట్లుగా చెబుతున్నారు. మొత్తం మీద చూస్తే గోదావరి జిల్లాల నుంచే కాపుల కదలిక అన్నది మొదలైంది అని అంటున్నారు. ఇది ఏ రూపం తీసుకుంటుంది అన్నది చూడాల్సి ఉంది. సార్వత్రిక ఎన్నికలు చూస్తే ఇంకా మూడేళ్ళకు పైగానే ఉన్నాయి. మరి ఇప్పటి నుంచే వైసీపీ అందుకున్న ఈ సరికొత్త కాపు నినాదం ఏ రకమైన పర్యవశానాలకు దారి తీస్తుందో చూడాల్సి ఉంది.

# అమరావతిలో ఇల్లు కొంటారా? ఆ టైం వచ్చేసింది! మొదలైన ప్రైవేటు నిర్మాణాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ కలల రాజధాని అమరావతి నిర్మాణ ప్రస్థానంలో సరికొత్త అధ్యాయం మొదలైంది. రాజధానిలో ప్రభుత్వ భవనాల నిర్మాణాలతోపాటు ప్రైవేటు ఇళ్ల నిర్మాణాలు మొదలయ్యాయి. దీంతో గత దశాబ్దకాలంగా రాజధానికి పట్టిన గ్రహణం వీడుతుందని వ్యాఖ్యానిస్తున్నారు. రాజధాని నిర్మాణం కోసం ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం కేటాయించిన ప్లాట్లలో, తొలిసారిగా ఒక రైతు సరికొత్త అపార్ట్‌మెంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అమరావతి రాజధాని పరిధిలోని ఎల్‌పీఎస్ జోన్ 7లో ఈ తొలి ప్రైవేటు గృహ నిర్మాణ పనులు ప్రారంభం కావడం విశేషం. రాజధాని ప్రాంతంలో గృహ నిర్మాణ రంగానికి కొత్త ఊపునిచ్చేలా ఈ ప్రాజెక్టును జీ౦5 అంతస్తుల విధానంలో నిర్మిస్తున్నారు. మొత్తం పది 3దీఎఖ ఫ్లాట్లతో అత్యాధునిక వసతులతో రూపుదిద్దుకుంటున్న ఈ భవనం, అమరావతి రియల్ ఎస్టేట్ రంగానికి ఒక రోల్ మోడల్‌గా నిలవబోతోందని వ్యాఖ్యానిస్తున్నారు.

ఈ అపార్ట్‌మెంట్ నిర్మాణంతో రాజధానిలో ప్రైవేటు ఇళ్లు, అపార్టుమెంట్ల నిర్మాణాలు జోరందుకునే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఇప్పటివరకు రాజధానిలో కేవలం ప్రభుత్వ భవనాలు మాత్రమే నిర్మితమవుతున్నాయి. ఫలితంగా రాజధాని ప్రాంతంలో ప్రభుత్వపరమైన అభివృద్ధి తప్ప, మరే పనులు జరగడం లేదని విపక్షాలు విమర్శలు గుప్పించేవి. నిజానికి రాజధానిలో ప్రైవేటు భవనాల నిర్మాణానికి రైతులు, భూ యజమానులు సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం సమీకరించిన భూములు అభివృద్ధి చేసి తిరిగి అప్పగించడంలో జాప్యం కారణంగా ఆలస్యమైందని అంటున్నారు. ఇప్పుడు ప్రభుత్వం రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు కేటాయిస్తుండటంతో ఆ సమస్య క్రమంగా తొలగిపోతుందని చెబుతున్నారు.

2015లో నవ్యాంధ్ర రాజధాని నిర్మాణం కోసం దాదాపు 30 వేల ఎకరాల భూములను స్థానిక రైతులు స్వచ్ఛందంగా ప్రభుత్వానికి ల్యాండ్ పూలింగ్ పద్ధతిలో అందజేశారు. ఆ సమయంలో ప్రపంచస్థాయి నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతామని, భూములిచ్చిన రైతులకు అభివృద్ధి చేసిన లేఅవుట్లలో వాణిజ్య, నివాస ప్లాట్లను రిటర్నబుల్ పద్ధతిలో కేటాయిస్తామని ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ క్రమంలోనే 2015 నుండి 2019 వరకు నాటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో తాత్కాలిక సచివాలయం, శాసనసభ, హైకోర్టు భవనాలు, సీడ్ యాక్సెస్ రోడ్డు వంటి మెరుగైన అంతర్గత రోడ్ల నిర్మాణాలు చకచకా సాగిపోయాయి.

అయితే 2019 అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో సంభవించిన రాజకీయ మార్పులు అమరావతి భవితవ్యాన్ని ఒక్కసారిగా ప్రశ్నార్థకం చేశాయి. ఆ ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం ఓడిపోవడంతో రాజధాని పనులకు పూర్తిగా గ్రహణం పట్టింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమరావతి నిర్మాణాన్ని పూర్తిగా అటకెక్కించి, మూడు రాజధానుల ప్రతిపాదనను తెరపైకి తీసుకువచ్చింది. ఈ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వివాదాస్పదంగా మారడమే కాకుండా, రాజధాని

ప్రాంతంలో దాదాపు ఐదేళ్లపాటు ఎలాంటి అభివృద్ధి పనులు జరగకుండా నిలిచిపోయేలా చేసింది. తమకు న్యాయం చేయాలంటూ రాజధాని రైతులు, మహిళలు సుదీర్ఘ కాలం పాటు చేసిన అమరావతి ఉద్యమం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.మళ్ళీ ఐదేళ్ల నిరీక్షణ తర్వాత, 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అమరావతి పనులు మళ్లీ పట్టాలెక్కాయి. ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో రాజధానిలోని జంగిల్ క్లియరెన్స్ పనులను పూర్తి చేసి, నిలిచిపోయిన అంతర్గత రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసింది. దీనితో పాటు రైతులకు ఇవ్వాల్సిన ప్రైవేటు ప్లాట్లను కూడా అధికారికంగా అప్పగించే ప్రక్రియ వేగం పుంజుకుంది. ప్రభుత్వ లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పించడంతో ధైర్యం తెచ్చుకున్న ఒక రైతు, తన ప్లాట్‌లో ఈ అపార్ట్‌మెంట్ నిర్మాణాన్ని ప్రారంభించి చరిత్ర సృష్టించారు. అమరావతి భూముల్లో సాకారమవుతున్న తొలి ప్రైవేటు భవనంగా దీనిని పేర్కొంటున్నారు.

ఈ తొలి ప్రైవేటు అపార్ట్‌మెంట్ నిర్మాణం కేవలం ఒక భవనానికో లేదా ఒక రైతుకో పరిమితమైనది కాదని వ్యాఖ్యానిస్తున్నారు. ఇది అమరావతి ప్రాంతంలో సుదీర్ఘ కాలంగా వేధిస్తున్న ఇళ్ల కొరత సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందనే ఆశలను చిగురింపజేస్తోందని అంటున్నారు. ప్రస్తుతం రాజధాని పరిధిలో సరైన వసతులు ఉన్న గృహ సముదాయాలు లేకపోవడం వల్ల వేలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది పక్కనే ఉన్న విజయవాడ, గుంటూరు నగరాల నుండి ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తున్నారు. ఈ అప్ అండ్ డౌన్ సర్వీసుల వల్ల ఉద్యోగులపై తీవ్రమైన పనిభారం, ప్రయాణ అలసట పడుతోంది. రాబోయే రోజుల్లో అమరావతిలోనే ఇళ్ల లభ్యత పెరిగితే, ఉద్యోగులంతా ఇక్కడే స్థిరపడే అవకాశం ఉంటుంది. ఫలితంగా రాజధాని ప్రాంతంలో రాత్రి వేళల్లో కూడా జనాభా సంచారం పెరిగి, హోటళ్లు, రవాణా, వాణిజ్య సముదాయాల రూపంలో ఆర్థిక కార్యకలాపాలు మరింత జోరుగా సాగుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## అలవోకగా ఆసనాలు.. అలుపెరుగని ఫిట్‌నెస్ : 76 ఏళ్ల వయసులో అదరగొట్టిన చంద్రబాబు



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన 'యోగాంధ్ర' వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అలవోకగా ఆసనాలు వేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. 76 ఏళ్ల వయసులో కూడా ఆయన ప్రదర్శించిన ఉత్సాహం ప్రతి ఒక్కరినీ ఆకట్టుంది. వయసులో ఆయన కంటే చాలా చిన్నవారు కూడా కొన్ని యోగసనాలు వేయడంలో ఇబ్బంది పడ్డారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం ఎటువంటి తడబాటు లేకుండా ఆసనాలు వేసి అదరగొట్టారని అంటున్నారు.

**వయసు కేవలం అంకె మాత్రమే..**

యోగా గురువు బాబా రామ్‌దేవ్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు వేదికపై ఎంతో సులభంగా, అలవోకగా కఠినమైన యోగాసనాలను వేశారు. సాధారణంగా ఈ వయసులో చాలామంది శారీరక ఇబ్బందులతో సతమతమవుతుంటారు. కానీ చంద్రబాబు మాత్రం ఎంతో చురుకుగా, యువకుడిలా కనిపించడం విశేషం. ఆయన చేస్తున్న స్ట్రెచెస్, యోగా భంగిమలు చూస్తుంటే ఆయన ఎంతటి క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని పాటిస్తున్నారో అర్థమవుతుందని వ్యాఖ్యానిస్తున్నారు.

**ఆరోగ్యమే మహాభాగ్యం**

చంద్రబాబు చురుకుదనానికి ఆయన పాటిస్తున్న ఆరోగ్య నియమాలే కారణమని చెప్పవచ్చు. నిత్యం ఎంతో బిజీగా ఉండే రాజకీయ బాధ్యతల మధ్య, ముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివృద్ధి కోసం అవిశ్రాంతంగా పనిచేసే ఆయన, తన ఆరోగ్యం విషయంలో ఎప్పుడూ రాజీ పడరని చెబుతుంటారు. సరైన ఆహారపు అలవాట్లు, క్రమశిక్షణతో కూడిన వ్యాయామం, యోగా పట్ల ఆయనకున్న అంకితభావమే ఆయనను ఇంత ఫిట్‌గా ఉంచుతున్నాయని చెబుతున్నారు. వయసుతో సంబంధం లేకుండా నిరంతరం చురుకుగా ఉంటూ, దేశంలోని రాజకీయ నాయకుల్లో ఒక అత్యుత్తమ 'ఫిటెస్ట్' లీడర్‌గా ఆయన నిలుస్తున్నారు.

**యోగాంధ్ర వేడుకల విశేషాలు**

ఈ భారీ యోగా కార్యక్రమానికి వేలాది మంది ఫిట్‌నెస్ ప్రేమికులు తరలివచ్చారు. దాదాపు 7,000 మందికి పైగా యోగాభ్యాసం చేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రితో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఇతర మంత్రులు కూడా పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ వేడుకల ద్వారా ముఖ్యమంత్రి ం

గారు ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనశైలిపై గొప్ప సందేశాన్ని అందించారు. నిజంగా, చంద్రబాబు ఫిట్‌నెస్ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం అంటూ అభినందిస్తున్నారు. క్రమశిక్షణ ఉంటే 76 ఏళ్ల వయసులో కూడా యవ్వనంతో, ఉత్సాహంతో జీవించవచ్చని ఆయన నిరూపించారని ఆరోగ్యాభిలాషులు వ్యాఖ్యానిస్తున్నారు.

# పవన్ వ్యాఖ్యలు ఐటెం సాంగ్స్ లాంటివే.. జగదీష్ రెడ్డి సెటైర్ వైరల్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో మాటల యుద్ధం మరోసారి ముదిరింది. బీఆర్ఎస్ మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి.. జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి.

తెలంగాణ రాజకీయాల్లో మాటల యుద్ధం మరోసారి ముదిరింది. బీఆర్ఎస్ మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి.. జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రసంగాలు, వ్యాఖ్యలపై జగదీష్ రెడ్డి తనదైన శైలిలో సెటైర్లు వేశారు.

**'ఐటెం సాంగ్స్'తో పోలిక.. అసలు ఉనికి ఎక్కడ?**

మీడియాతో మాట్లాడిన జగదీష్ రెడ్డి, పవన్ కళ్యాణ్ చేసే వ్యాఖ్యలను సినిమాల్లో వచ్చే 'ఐటెం సాంగ్స్'తో పోల్చారు. సినిమాల్లో ఐటెం సాంగ్స్‌కు, మెయిన్ స్టోరీకి ఎలాంటి సంబంధం ఉండదో.. పవన్ కళ్యాణ్ మాట్లాడే మాటలకు కూడా సమకాలీన రాజకీయాలకు, నిజమైన ప్రజా సమస్యలకు అసలు సంబంధమే ఉండదని ఎద్దేవా చేశారు. "తెలంగాణలో జనసేన అనే పార్టీకి రాజకీయంగా ఎలాంటి ఉనికి లేదు. అలాంటి పార్టీ గురించి, ఆ పార్టీ నాయకుడి గురించి తాము ప్రత్యేకంగా మాట్లాడాల్సిన అవసరం లేదు. పవన్ కళ్యాణ్ అప్పుడప్పుడు వచ్చి చేసే వ్యాఖ్యలు కేవలం పొలిటికల్ ఐటెం సాంగ్స్ లాంటివే. వాటిని ప్రజలు కూడా పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు." అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సెటైర్లు వేశారు.

**తెర వెనుక రాజకీయ నాటకం.. కాంగ్రెస్, బీజేపీలపై ధ్వజం**

పవన్ కళ్యాణ్ వెనుక పెద్ద రాజకీయ వ్యూహం దాగి ఉందంటూ జగదీష్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ, జనసేన పార్టీలు కలిసి తెరవెనుక ఒక పెద్ద రాజకీయ నాటకానికి తెరలేపాయని విమర్శించారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ, అలాగే కాంగ్రెస్ అగ్రనేతల ప్రయోజనాల కోసమే పవన్ కళ్యాణ్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలను అసలు సమస్యల నుంచి దారి మళ్లించేందుకే ఈ మూడు పార్టీలు కలిసి డ్రామాలు ఆడుతున్నాయని ఆయన ధ్వజమెత్తారు.

**రైతు సమస్యలపై సర్కార్‌కు అల్టిమేటం**

రాజకీయ విమర్శలతో పాటు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై, రైతుల సమస్యలపై జగదీష్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన ప్రస్తావించారు. రైతులు ఎంతో కష్టపడి పండించిన ప్రతి పంట గింజను ప్రభుత్వం తప్పనిసరిగా.. నిబంధనల ప్రకారం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. రైతుల హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, వారి తరఫున రాజీలేని పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నుంచి పంటను సేకరించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే.. ఊరుకునే ప్రసక్తే లేదని, రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టి ప్రభుత్వాన్ని గద్దె దించుతామని జగదీష్ రెడ్డి హెచ్చరించారు.

**జనసేన రియాక్షన్ ఎలా ఉండబోతోంది?**

జగదీష్ రెడ్డి చేసిన ఈ 'ఐటెం సాంగ్' వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ అభిమానులు, జనసేన శ్రేణులు ఈ వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరి జగదీష్ రెడ్డి చేసిన ఈ ఘాటు విమర్శలపై జనసేన నాయకత్వం, ముఖ్యంగా తెలంగాణ జనసేన నేతలు ఏ విధంగా కౌంటర్ ఇస్తారనేది ఇప్పుడు తెలుగు రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

## భయం కాదు... భరోసానే పనిచేస్తుంది..

# థియేటర్స్ లో యాడ్స్ గేమ్ చేంజ్



**హైదరాబాద్ పెన్ పవర్:** సినిమా థియేటర్లలో సినిమా మొదలయ్యే ముందు వచ్చే స్మోకింగ్, క్యాన్సర్ యాడ్స్ మనందరికీ తెలిసిందే. అయితే, భయపెట్టే ఆ పాత యాడ్స్ చూసి జనాలు మారకపోగా, చిరాకుపడి ఫోన్లు చూసుకోవడం అలవాటుగా మార్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక సరికొత్త ఆలోచనతో ముందుకొచ్చింది. చెడు అలవాట్లను తిట్టడం పక్కనబెట్టి, మంచి ఆహార అలవాట్లపై థియేటర్లలో పాజిటివ్ యాడ్స్ వేస్తూ ఒక సరికొత్త గేమ్ చేంజ్ ప్రయోగానికి శ్రీకారం చుట్టింది.

**భయపెట్టే మార్కెటింగ్‌కు కాలం చెల్లింది:**

దశాబ్దాలుగా "సిగరెట్ తాగితే చచ్చిపోతారు" అని భయంకరమైన విజువల్స్ చూపించడం ఒక పద్ధతిగా వస్తోంది. కానీ సైకాలజీ ప్రకారం.. మనుషులు విపరీతమైన భయాన్ని లేదా జుగుప్స కలిగించే దృశ్యాలను చూసినప్పుడు, వారి మైండ్ దాన్ని రిజెక్ట్ చేస్తుంది. అందుకే జనాలు ఆ స్క్రీన్ వైపు చూడటం మానేశారు. పైగా గతంలో వచ్చిన కొన్ని స్మోకింగ్ యాడ్స్ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోలింగ్‌కు గురయ్యాయి తప్ప, వాటి వల్ల ఆశించిన మార్పు రాలేదు.

**భయం కలిగించడం కాదు.. బాధ్యత గుర్తు చేయడం:**

ఇక్కడే ఏపీ ప్రభుత్వం తన విధానం మార్చింది. చెడును వదిలేయమని ఒత్తిడి తెచ్చే కంటే.. మంచి అలవాట్ల వల్ల వచ్చే లాభాలను ఆహ్లాదకరంగా చూపించడం మొదలుపెట్టింది. నూనె పదార్థాలకు దూరంగా ఉండటం, చిరుధాన్యాలు ప్రాధాన్యత, ఉప్పు వాడకం తగ్గించడం వంటి విషయాలపై సృజనాత్మకంగా యాడ్స్ డిజైన్ చేయించింది. "ఇవి తింటే మీ కుటుంబం ఆనందంగా, ఆరోగ్యంగా ఉంటుంది" అనే భరోసాను ఇవ్వడం వల్ల ఇవి జనాలకు బాగా కనెక్ట్ అవుతున్నాయి.

**ముఖ్యమంత్రి చంద్రబాబు స్పెషల్ ఫోకస్:**

ముఖ్యమంత్రి చంద్రబాబు గారు ఈ మధ్య కాలంలో ప్రజల ఆహార అలవాట్లపై ప్రత్యేకంగా మాట్లాడుతున్నారు. బయటి జంక్ ఫుడ్ వల్ల చిన్న వయసులోనే పిల్లలు, పెద్దలు అనారోగ్యం కొనితెచ్చుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే నేరుగా చెబితే వినని జనానికి, థియేటర్లలో ప్రశాంతంగా కూర్చునే సమయంలో ఈ సానుకూల సందేశాలను అందిస్తున్నారు. ఇక మొదట మెయిన్ సెంటర్లలో మొదలైన ఈ యాడ్స్, త్వరలోనే బి, సి సెంటర్ల థియేటర్లలో కూడా తప్పనిసరి కానున్నాయి. నెగెటివ్ ప్రచారం కన్నా పాజిటివ్ ప్రచారమే సమాజంలో ఎక్కువ ప్రభావం చూపుతుంది. థియేటర్లను వేదికగా చేసుకుని ఏపీ ప్రభుత్వం చేస్తున్న ఈ సరికొత్త హెల్త్ ప్రయోగం గనుక ఇక్కడ సక్సెస్ అయితే, రాబోయే రోజుల్లో మిగతా రాష్ట్రాలు కూడా ఇదే బాట పట్టే అవకాశం ఉంది. ఇక ఏదేమైనా, భయపెట్టడం కంటే భరోసా ఇవ్వడమే మార్పునకు తొలి అడుగు అని ఈ సరికొత్త థియేటర్ యాడ్స్ నిరూపిస్తున్నాయి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965


# కృష్ణలంక కేసులో అనూహ్య ట్విస్ట్.. పోలీసుస్టేషన్ వద్ద మహిళల ధర్నా




**హైదరాబాద్ పెన్ పవర్:** విజయవాడ కృష్ణలంక పోలీసుస్టేషన్ కేంద్రంగా జరుగుతున్న పరిణామాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. కృష్ణలంకకు చెందిన రౌడీషీటర్ గాదె సాయికృష్ణ మిస్సింగ్ మిస్టరీ కొద్దిరోజులుగా హాట్ టాపిక్ అవుతున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ నాగరాజును ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అంతేకాకుండా సాయికృష్ణ మిస్సింగ్ పై అతడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సీఐపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. దీని ఆధారంగా సీఐ నాగరాజును అరెస్టు చేస్తారనే ప్రచారం నేపథ్యంలో ఆదివారం అనూహ్యరీతిలో సీఐకి మద్దతుగా మహిళలు ఆందోళన నిర్వహించారు.

రౌడీషీటర్ సాయికృష్ణ మిస్సింగ్ కేసులో సీఐని అరెస్టు చేస్తారనే ప్రచారంపై స్థానిక మహిళలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సీఐకి మద్దతుగా ఆదివారం కృష్ణలంక పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. నిమ్మల జ్యోతిక నాయుడు అనే మహిళా నాయకురాలు ఆధ్వర్యంలో పలువురు మహిళలు, యువకులు సీఐకి మద్దతుగా నినాదాలు చేశారు. సీఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు శాంతిభద్రతలను కాపాడుతున్నారంటూ కితాబునిచ్చారు. దీంతో మహిళల ఆందోళన కార్యక్రమం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ఈ వ్యవహారంతో సాయికృష్ణ మిస్సింగ్ మిస్టరీ మరో టర్న్ తీసుకుందని వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటివరకు సీఐ నాగరాజుపై బాధితులు, విపక్ష నేతలు ఆరోపణలు చేస్తున్నారు. వారి విమర్శల దాడితో ప్రభుత్వం కూడా ఆత్మరక్షణలోకి వెళ్లినట్లు కనిపించిందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. సాయికృష్ణ మిస్సింగును ఓ కులానికి కూడా ముడిపెట్టే ప్రయత్నాలు జరుగుతుండటంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. నలుగురు ఐపీఎస్ అధికారులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించి మిస్టరీని ఛేదించాలని నిర్ణయించింది.ఇటువంటి పరిస్థితుల్లో స్థానిక మహిళలు అనూహ్యంగా రంగంలోకి దిగారు. గంజాయి, బ్లేడ్ బ్యాచులను ఉక్కుపాదంతో అణచివేస్తున్న సీఐ నాగరాజుపై చర్యలు తీసుకోవడం కరెక్టు కాదని చెబుతున్నారు. అయితే గత రెండు వారాలుగా ఈ వివాదం తీవ్ర దుమారం రేపుతుండగా, ప్రభుత్వం సీరియస్ గా చర్యలకు సిద్ధమైన తర్వాత స్థానికులు రంగంలోకి దిగడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సీఐకి మద్దతుగా ఆందోళన చేసిన మహిళలు స్వచ్ఛందంగా ఆ నిర్ణయం తీసుకున్నారా? లేక వేరొరి ప్రోద్బలంతో ధర్నాకు వచ్చారా? అనే అంశంపై చర్చ జరుగుతోంది. మొత్తానికి సీఐకి మద్దతుగా స్థానికులు రోడ్డెక్కడం ఈ కేసును మలుపు తిప్పడమే అంటున్నారు. ఈ ఆందోళన విషయంలో ప్రభుత్వం ఎలా స్పందిస్తుంది అన్నది కూడా ఆసక్తి రేపుతోందని అంటున్నారు.

# సనాతన భారతీయ సంస్కృతిని ఇష్టపడే టాప్-5 వరల్డ్ ఫేమస్ రైటర్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశం అనేది కేవలం ఒక భౌగోళిక సరిహద్దులు కలిగిన దేశం కాదు.. అది ఒక లోతైన అనుభూతి.. సనాతన సంస్కృతుల నిలయం. యుగయుగాలుగా ఈ పుణ్యభూమి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎందరో మేధావులను, పర్యాటకులను, రచయితలను తనవైపుకు ఆకర్షిస్తూనే ఉంది. జర్మన్ రచయిత మరియా విర్త్ తాజా పర్యటనలో భారతదేశంపై తన ప్రేమను, ఉద్వేగాన్ని ఏమాత్రం దాచుకోకుండా ప్రదర్శించారు. తాను 40 దేశాలలో సంచరిస్తే, ఇక్కడ ఉన్న వివేకవంతులు, జ్ఞానులు తనకు ఎంతగానో నచ్చారని ప్రశంసించారు. అంతేకాదు ఏ దేశంలోను లేనంతగా అపారమైన ప్రేమను కూడా ఇక్కడ పొందానని ఎమోషనల్ అయ్యారు. అయితే ఆమె లాగే, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఎంతోమంది ప్రపంచ విఖ్యాత రచయితలు భారత్‌ను సందర్శించి.. ఇక్కడి జీవన విధానాన్ని.. ఆధ్యాత్మికతను చూసి ముగ్ధులయ్యారు. వారి కలాల నుండి జాలువారిన ప్రశంసలు నేటికీ భారతీయ సంస్కృతి సాంప్రదాయాల గొప్పతనానికి సజీవ సాక్ష్యాలుగా నిలిచాయి.

అమెరికన్ సాహిత్య పితామహుడు, ప్రఖ్యాత రచయిత మార్క్ ట్వైన్ 1896లో భారతదేశంలో పర్యటించినప్పుడు ఇక్కడి వైవిధ్యాన్ని చూసి ఆశ్చర్యపోయారు. మానవ ఇతిహాసంలో అత్యంత విలువైన, విజ్ఞానదాయకమైన అంశాలు భారతదేశంలోనే దాగి ఉన్నాయని ట్వైన్ నమ్మేవారు. --భారతదేశం అనేది మానవజాతికి ఊయల.. చరిత్రకు తల్లి.. పురాణాలకు అమ్మమ్మ-- అంటూ ఆయన మన సంస్కృతిని కొనియాడారు. ఇక్కడి ప్రజల జీవనశైలి, శతాబ్దాల నాటి సంప్రదాయాలు కాలంతో పాటు మారకుండా అలాగే సజీవంగా ఉండటం మార్క్ ట్వైన్‌ను అమితంగా ఆకట్టుకుంది.

మరోవైపు బ్రిటన్‌కు చెందిన ప్రముఖ చరిత్రకారుడు.. రచయిత విలియం డాల్రింపుల్ భారతదేశ చరిత్రతో ఎంతగా ప్రేమలో పడ్డారంటే.. ఆయన తన స్వదేశాన్ని వదిలి దశాబ్దాల క్రితమే ఇక్కడికి వచ్చి ఢిల్లీలో స్థిరపడిపోయారు. -సిటీ ఆఫ్ జిన్స్- వంటి అద్భుతమైన పుస్తకాల్లో ఆయన భారతీయ సంస్కృతిని ఆవిష్కరించారు. అలాగే ఫ్రెంచ్ నోబెల్ గ్రహీత రోమైన్ రోలాండ్ వంటి తాత్వికులు కూడా భారతీయ వేదాంతాన్ని.. ముఖ్యంగా స్వామి వివేకానందుడి బోధనలను అధ్యయనం చేసి.. మానవ మేధస్సు అత్యున్నత రూపం భారత్‌లోనే వ్యక్తమైందని ప్రపంచానికి చాటిచెప్పారు.

చరిత్ర పుటల్లోకి వెళ్తే... క్రీస్తుశకం 7వ శతాబ్దంలో చైనా నుండి వచ్చిన బౌద్ధ పర్యాటకుడు, రచయిత హ్యుయాన్ త్సాంగ్ నాటి భారతదేశ వైభవాన్ని తన -సి-యు-కి- గ్రంథంలో అద్భుతంగా లిఖించారు. నలంద విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించిన ఆయన ఇక్కడి ప్రజల నిజాయితీని, విద్యా వ్యవస్థను, ఆతిథ్య గుణాన్ని ఎంతగానో ప్రశంసించారు. ఈ విధంగా పురాతన కాలం నాటి హ్యుయాన్ త్సాంగ్ నుండి ఆధునిక యుగపు మరియా విర్త్, విలియం డాల్రింపుల్ వరకు... ప్రతి ఒక్క అంతర్జాతీయ రచయిత కూడా భారతదేశంలో ఉండే గందరగోళం వెనుక ఒక అద్భుతమైన ప్రశాంతత, ఆధ్యాత్మిక సంపద దాగి ఉన్నాయని ముక్తకంఠంతో అంగీకరించారు.

# కేంద్రంలో కీలక మార్పులు!?.. రాజ్‌నాథ్ నివాసంలో రహస్య భేటీ



**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వంలో కీలక మార్పులు జరగబోతున్నాయనే సంకేతాలు అందుతున్నాయి. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణతోపాటు వివిధ రాష్ట్రాలకు కొత్త గవర్నర్ల నియామకంపై జోరుగా కసరత్తు జరుగుతోంది. గత కొద్ది రోజులుగా ఈ అంశంపై విస్తృత చర్చలు జరుగుతున్నాయని కథనాలు వస్తున్నాయి. కేంద్రంలో ప్రధాని మోదీ 2.0 ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మంత్రివర్గంలో మార్పులు చేయనున్నారని బీజేపీ వర్గాలలో చర్చ జరుగుతోంది. ప్రధానంగా ఆర్ఎస్ఎస్-బీజేపీ సిద్ధాంతాలకు అనుగుణంగా 75 ఏళ్లు నిండిన వారిని మంత్రివర్గం నుంచి తప్పించాలనే ఆలోచనలో కేంద్ర పెద్దలు ఉన్నారని అంటున్నారు. అదే సమయంలో యువకులకు మంత్రివర్గంలో చోటివ్వాలని నిర్ణయించుకున్నారని అంటున్నారు.మంత్రివర్గంలో భారీ మార్పులు ఉంటాయనే ఊహాగానాల నేపథ్యంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నివాసంలో బీజేపీ-ఆర్ఎస్ఎస్ ప్రముఖుల భేటీ ఆసక్తికరంగా మారింది. ఈ సమావేశం అజెండా బయటకు రానప్పటికీ కేంద్ర మంత్రివర్గంలో మార్పులు చేర్పులపై చర్చించేందుకే ఈ భేటీ జరిగి ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. కేంద్ర మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించాలని ఎప్పటి నుంచో బీజేపీ పెద్దలు అనుకుంటున్నారని, మంత్రి వర్గంలో ఎవరిని ఉంచాలి? ఎవరిని తప్పించాలి అన్న అంశంపై ఆర్ఎస్ఎస్ ప్రముఖుల అభిప్రాయం తీసుకోడానికి ఈ భేటీ జరిగిందని అంటున్నారు.

బీజేపీ మాతృ సంస్థ అయిన ఆర్ఎస్ఎస్ నిర్ణయం ప్రకారమే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందనేది బహిరంగ రహస్యం. ప్రధానిగా మోదీకి ప్రభుత్వం నడిపే విషయంలో పూర్తి స్వేచ్ఛ, స్వతంత్రం ఇచ్చినప్పటికీ ప్రభుత్వంలో ఎవరెవరు ఉండాలనేది ఆర్ఎస్ఎస్ నిర్ణయిస్తుందని బీజేపీ రాజకీయాలు బాగా తెలిసిన వారు చెబుతుంటారు. ఈ నేపథ్యంలో రాజ్‌నాథ్ సింగ్ నివాసంలో ఆర్ఎస్ఎస్ నేతలో బీజేపీ పెద్దల చర్చలు కేంద్ర మంత్రివర్గ విస్తరణపై జరుగుతున్న ప్రచారానికి ఊతమిస్తోందని అంటున్నారు.యువతను ప్రోత్సహించడంతోపాటు వృద్ధ తరాన్ని తప్పించాలనే ఆలోచనతో కేంద్ర పెద్దలు కసరత్తు చేస్తున్నారని అంటున్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో సుమారు 40 శాతం మందిని తప్పించాలని భావిస్తున్నారని చెబుతున్నారు. అదే సమయంలో కొందరు మంత్రుల శాఖల్లోనూ మార్పులు చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఇక పనితీరు సరిగా లేని వారిని తప్పించడంతోపాటు వారి స్థానంలో యువకులకు అవకాశమిస్తారని చెబుతున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం త్వరలో కొన్ని రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమిస్తారని చెబుతున్నారు. మంత్రివర్గంలో సీనియర్లను తప్పించి వారికి గవర్నర్లుగా పంపుతారని అంటున్నారు. దీంతో ఎవరిపై వేటు పడుతుంది? ఎవరికి స్థాన చలనం ఉంటుందనేది చర్చనీయాంశంగా మారింది.

# రెచ్చగొట్టొద్దు.. ఇండియా వార్నింగ్.. భారత్-పాక్ మధ్య ముదురుతున్న దౌత్య యుద్ధం..





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్-పాకిస్థాన్ మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు మరోసారి తీవ్రరూపం దాల్చాయి. పాకిస్థాన్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ భారత్‌లోని ముస్లిం మతపరమైన స్థలాలు, చారిత్రక కట్టడాలకు ముప్పు ఉందంటూ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య కొత్త వివాదానికి తెరలేపాయి. జర్దారీ చేసిన ఈ ఆరోపణలను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు పాకిస్థాన్‌కు ఎంతమాత్రం లేదని స్పష్టం చేస్తూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలని గట్టిగా హెచ్చరించింది.

**పాకిస్థాన్ ఆరోపణలు.. భారత్ ఘాటు కౌంటర్**

ఇటీవల పాకిస్థాన్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ తన ఎక్స్ ఖాతా ద్వారా భారత్‌పై విషం చిమ్మారు. వారణాసిలోని పురాతన మసీదు సహా దేశంలోని కొన్ని ముస్లిం వారసత్వ కట్టడాలకు ప్రమాదం పొంచి ఉందని ఆయన ఆరోపించారు. భారత్ తన దేశంలోని మైనారిటీల హక్కులను పరిరక్షించాలని, చారిత్రక కట్టడాలను కాపాడాలని వ్యాఖ్యానించారు.

జర్దారీ చేసిన ఈ నిరాధార ఆరోపణలపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తీవ్రంగా స్పందించారు. భారత్‌లో మైనారిటీల హక్కుల గురించి మాట్లాడే అర్హత పాకిస్థాన్‌కు లేదని ఆయన కొట్టిపారేశారు. "సొంత దేశంలో హిందువులు, సిక్కులు, క్రైస్తవులతో సహా మైనారిటీ వర్గాలు దారుణమైన వేధింపులను ఎదుర్కొంటున్నాయి. వారిపై జరుగుతున్న అత్యాచారాలను ప్రపంచమంతా చూస్తోంది. అలాంటి పరిస్థితుల్లో పాకిస్థాన్ భారత్‌కు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉంది" అని రణధీర్ జైస్వాల్ ఎద్దేవా చేశారు.

**రాజ్యాంగ వ్యవస్థలపై నమ్మకం ఉంది: భారత్**

భారతదేశంలోని మతపరమైన, చారిత్రక వారసత్వాన్ని రక్షించే పూర్తి బాధ్యత, సామర్థ్యం భారత రాజ్యాంగ వ్యవస్థలకు ఉందని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. పాకిస్థాన్ ఉద్దేశపూర్వకంగానే అంతర్జాతీయ సమాజం ముందు భారత్ ప్రతిష్టను దిగజార్చడానికి ఇలాంటి దుష్ప్రచారాలకు ఒడిగడుతోందని మండిపడింది. జర్దారీ వ్యాఖ్యలకు ఎలాంటి ఆధారాలు లేవని, ఇవి కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం చేసినవేనని తేల్చిచెప్పింది.

**ముదురుతున్న దౌత్య యుద్ధం**

భారత్-పాకిస్థాన్ సంబంధాలు గత కొంతకాలంగా అత్యంత క్లిష్ట దశలో కొనసాగుతున్నాయి. ముఖ్యంగా పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. అంతర్జాతీయ వేదికలపై కూడా పాకిస్థాన్ నిరంతరం భారత్‌ను టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తుండగా ప్రతి సందర్భంలోనూ భారత్ వాస్తవాలు దీటైన ఆధారాలతో పాక్‌ను ఎండగడుతోంది. ద్వైపాక్షిక సంబంధాలు ఇప్పటికే క్షీణించిన తరుణంలో, ఇలాంటి అగ్రనేతల రాజకీయ వ్యాఖ్యలు ఉద్రిక్తతలను మరింత పెంచుతాయి. పరస్పర ఆరోపణల వల్ల సరిహద్దుల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉంది. ప్రాంతీయ స్థిరత్వం కోసం ఇరు దేశాలు దౌత్యపరమైన సంభాషణల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ప్రస్తుతం జర్దారీ వ్యాఖ్యలపై భారత్ ఇచ్చిన ఘాటు స్పందనను బట్టి చూస్తే ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన దూరం మరింత పెరిగేలా కనిపిస్తోంది. సొంత దేశంలోని అంతర్గత సంక్షోభాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే పాక్ పాలకులు తరచూ భారత్‌పై ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తుంటారనేది జగమెరిగిన సత్యం.

# ఏపీకి కులాల దరిద్రం...అంత సులువుగా పోతుందా ?


**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ రాజకీయాలు అంటేనే కులాల సమాహారంగా చెబుతారు. అసలు కులం ప్రస్తావన లేకుండా ఏపీలో రాజకీయం సాగడం లేదు. అది ఇవాళా నిన్నా వచ్చినది కాదు. 1953 అక్టోబర్ 1న ఉమ్మడి మద్రాస్ స్టేట్ నుంచి ఏపీ విడిపోయినపుడు తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం అయ్యారు. అయితే అతి కొద్ది నెలలలోనే ఆయనను దించేశారు. దాని వెనక బలమైన సామాజిక వర్గం ఆకాంక్షలు ఉన్నాయని చెబుతారు. ఇక ఏపీ నాటి హైదరాబాద్ స్టేట్ విలీనం అయి 1956 రాష్ట్రం ఏర్పడింది. అపుడు కూడా హైదరాబాద్ స్టేట్ తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామక్రిష్ణారావుకి చాన్స్ ఇవ్వనిది బలమైన కులాల ఆశల ఫలితమే అన్నది ఒక విశ్లేషణ.

**కులంతోనే సాగుతోంది :**

ఉమ్మడి ఏపీలో చూసుకుంటే ఒకసారి దళిత ముఖ్యమంత్రికి చాన్స్ వచ్చింది. మరోసారి ఒక బ్రాహ్మణుడికి సీఎం గా అవకాశం వచ్చింది. ఈ రెండు సార్లూ వారిని ఎక్కువ కాలం గద్దె మీద ఉండనీయకుండా చేసినది కుల రాజకీయమే అన్నది చరిత్ర చెబుతున్న సత్యం. ఇక ఏపీలో మూడున్నర దశాబ్దాల పాటు కాంగ్రెస్ ఉమ్మడి ఏపీని ఏలింది. ఒకే కులానికి అగ్ర తాంబూలం ఇస్తున్నారు అని భావించే ఆల్టర్నేషన్ పాలిటిక్స్ అవతరించింది. అలా టీడీపీ పుట్టుకుని వచ్చింది. ఇక టీడీపీలో సీఎం లు అయిన వారు కానీ ఆ తరువాత బీఆర్ఎస్ కానీ వైసీపీ కానీ సీఎంలు అయిన వారు ఆయా పార్టీలను అత్యధికులు సొంతం చేసుకున్న సామాజిక వర్గాల నుంచే అన్నది కూడా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

**చిరకాల కోరికగా :**

ఇక ఈ రోజున ఒక బలమైన సామాజిక వర్గంగా కాపులు తమకు ముఖ్యమంత్రి పీఠం ఒక్కసారి అయినా దక్కాలని కోరుకుంటున్నారు. వారి ఆశలకు దారులు వెతుకుతున్న నేపథ్యం కూడా ఉంది. మరో వైపు బీసీల నుంచి సీఎం పదవి కావాలన్నది నినాదంగా ఉంది. ఇక ఎస్సీ ఎస్టీ బీసీ బహుజన ఫ్రంట్ పేరుతో కొత్త రాజకీయ వేదికల సృష్టి వెనక బలమైన సిద్ధాంతాల కంటే తమ సామాజిక వర్గం వారికి రాజకీయ అధికారం దక్కాలని కోరిక బలంగా ఉండడమే అన్నది కూడా ఆలోచించాల్సిన విషయం.



**జనంలో ఉందా :**


నిజం చెప్పాలి అంటే మొదట్లో జనంలో ఈ కుల భావన అయితే లేదు, కానీ తమ అవసరాలకు తగినట్లుగా రాజకీయ పార్టీలు ఓట్ల వేట కోసమే కుల భావనను పెంచి పెద్దది చేసి జనాల మీదకు రుద్దారు. ఇపుడు ప్రజలు ఆ కుల భావనలో అమాయకంగా కొట్టుకుని పోతూంటే అది వద్దు అని నేతలు ఇపుడు తాపీగా చెబుతున్నారు. నిజానికి ఇలా చెప్పే నేతలు ఎన్నికల వేళ తమ తమ పార్టీల తరఫున ఇచ్చే టికెట్లను ఒకసారి పరిశీలిస్తే వారు అన్ని సామాజిక వర్గాలను సంతృప్తి పరచాలన్న ఉద్దేశ్యంతోనే ఇస్తున్నారు అన్నది కూడా వాస్తవం. అంతే కాదు నామినేటెడ్ పదవులు ఆఖరుకు ఆలయాలలో దేవుడికి సేవ చేసుకునేందుకు ట్రస్టీ పదవులు అని చెప్పి వాటిని కూడా కులం కొలమానంతోనే చూస్తూ ఇస్తున్న నేపథ్యం ఉంది.

**అల్లుకుపోయిన వైనం :**

ఇంతలా కులం అన్నది ఏపీ సమాజంలో అల్లుకుని ఊడలు దిగిపోవడానికి కారణం రాజకీయ పార్టీలదే అన్న విశ్లేషణలు ఉన్నాయి. అంతే కాదు కులం అన్నది ఒక గుర్తింపుగా మార్చి అందలాలు ఎక్కించడం మొదలయ్యాక ఎవరూ ఆ బాట నుంచి సులువుగా తప్పుకునేందుకు సిద్ధంగా ఉండరన్నది కూడా తెలిసిందే. ఈ రోజున కూడా ఇంత కుల భావన ఉన్నా కొన్ని సామాజిక వర్గాలకు రాజ్యాంగ పదవులు దక్కడం లేదు అన్నది కూడా ఆయా వర్గాలలో ఆవేదన ఉంది. బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి ఎమ్మెల్యేలు ఎంపీలు ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎంత అన్నది వారు ప్రశ్నిస్తున్న విషయం. అలాగే ఏపీ కేబినెట్ లో తమకు స్థానం లేదా అని క్షత్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్న వైనం ఉంది. అలాగే బీసీలలో చాలా ఉప కులాలు ఈ రోజుకీ రాజ్యాధికారం నోచుకోలేదని రోదిస్తున్నాయి. మరి ఇంతలా పెంచి పోషించిన కులాల కుంపటిని మహా సముద్రాలను తెచ్చి ఆర్పడానికి ప్రయత్నాలు చేసినా అవుతుందా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇది మేధావుల బుర్రలను కూడా దొలిచేస్తున్న మాట.

# సగం మంది డ్రైవర్లకు తెలియదు.. గూగుల్ మ్యాప్స్‌లో కనిపించే 9 అదిరిపోయే ఫీచర్లు ఇవే!

గూగుల్ మ్యాప్స్ మనందరి ఫోన్లలోనూ ఉంటుంది. కానీ, చాలా మంది దీనిని కేవలం ఒక ఊరు నుండి ఇంకో ఊరికి వెళ్ళడానికి, ఎక్కడికైనా వెళ్లేందుకు దారి తెలుసుకోవడానికి మాత్రమే వాడుతుంటారు. నిజానికి, ఇందులో డ్రైవింగ్‌ను మరింత ఈజీగా, సేఫ్ గా మార్చే ఎన్నో అద్భుతమైన ఫీచర్లు, షార్ట్‌కట్లు ఉన్నాయి. ఒక డ్రైవర్‌గా మీరు వీటిని తెలుసుకుంటే, మీ జర్నీలో టెన్షన్ సగం తగ్గిపోతుంది. ప్రతి డ్రైవర్ కచ్చితంగా తెలుసుకోవలసిన 9 గూగుల్ మ్యాప్స్ ట్రిక్స్ ఏంటో ఇప్పుడు చూద్దాం....



### 1. ఎడమ, కుడి వైపుకు స్వైప్ చేయడం
మీరు జర్నీ స్టార్ట్ చేసే ముందే, ఎక్కడెక్కడ ఎలాంటి టర్నింగ్స్ రాబోతున్నాయో తెలుసుకోవడం చాలా ముఖ్యం. దీనికోసం మ్యాప్‌లో పైన కనిపించే డైరెక్షన్ బాక్స్‌పై వేలితో ఎడమ లేదా కుడి వైపునకు స్వైప్ చేస్తే చాలు. మీ నెక్స్ట్ టర్నింగ్ ఏంటో స్క్రీన్‌పైనే క్లియర్ ప్రివ్యూ కనిపిస్తుంది. సిటీ నగరాల్లో రోడ్లలో వెళ్లేటప్పుడు ఈ ఫీచర్ చాల బాగా ఉపయోగపడుతుంది. ఫోన్లలోనే కాకుండా కార్లలోని ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ కార్ ప్లేలలో కూడా పని చేస్తుంది.

### 2. మ్యాప్‌లో మీరు ఉన్న చోటుకి
డ్రైవింగ్ చేసేటప్పుడు ఒక్కోసారి వేరే రూట్లు చూడటానికి మ్యాప్‌ను అటూ ఇటూ స్క్రోల్ చేస్తూ ఉంటాం. అలాంటప్పుడు మళ్లీ మనం ప్రస్తుతం ఉన్న చోటుకి మ్యాప్ రావాలంటే వెతుక్కోవాల్సిన పనిలేదు. స్క్రీన్‌పై ఉండే '=వ-ఎవత్‌వతీ' బటన్ నొక్కితే మ్యాప్ వెంటనే మీరు ఉన్న లొకేషన్‌కు వచ్చేస్తుంది. ఒకవేళ డ్రైవింగ్ చేస్తూ బటన్ నొక్కడం కుదరకపోతే, "ఓకే గూగుల్, రీ-సెంటర్" (రాని +శీశీస్త్రశ్రీవ, =వ-ఎవత్‌వతీ) అని చెప్తే వాయిస్ కమాండ్ ద్వారా కూడా ఇది జరిగిపోతుంది.

### 3. రెండు వేళ్లతో మ్యాప్‌ను తిప్పడం
మ్యాప్ చూసేటప్పుడు స్క్రీన్ పై భాగం ఎప్పుడూ ఉత్తరం (చీశీతీ్ప్ర) వైపే ఉండాలనుకునే వారు కొందరు ఉంటారు. అలాంటి వారు మ్యాప్ యాంగిల్ మార్చుకోవడానికి స్క్రీన్‌పై రెండు వేళ్లు ఉంచి, క్లాక్ వైజ్ లో లేదా యాంటీ క్లాక్ వైజ్ లో తిప్పవచ్చు. దీనివల్ల చుట్టుపక్కల ప్రాంతాలు, రోడ్ల దిశలు మరింత స్పష్టంగా అర్థమవుతాయి.

### 4. మధ్యలో ఎక్కడైనా ఆగాలంటే
లాంగ్ జర్నీలో వెళ్లేటప్పుడు మధ్యలో పెట్రోల్ బంక్, హోటల్ లేదా కాఫీ షాప్ దగ్గర ఆగాల్సి రావచ్చు. అలాంటప్పుడు ఉన్న నావిగేషన్‌ను క్యాన్సిల్ చేసి మళ్లీ కొత్తగా సెట్ చేయక్కర్లేదు. మ్యాప్‌లో మీకు కావలసిన చోట ట్యాప్ చేసి "ూ౨౨ రశీజూ" అని నొక్కితే చాలు, అది మీ రూట్ లోనే ఒక స్టాప్‌గా యాడ్ అయిపోతుంది లేదా సెర్చ్ బార్‌లో నేరుగా వెతికి కూడా యాడ్ చేసుకోవచ్చు.

### 5. రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ గురించి రిపోర్ట్ చేయడం
మీరు వెళ్లే దారిలో ఏదైనా ప్రమాదం జరిగినా, ట్రాఫిక్ నిలిచిపోయినా, రోడ్డు పనులు జరుగుతున్నా ఆ విషయాన్ని మ్యాప్‌లోని రిపోర్ట్ ఐకాన్ ద్వారా గూగుల్‌కు చెప్పొచ్చు. మీరు ఇచ్చే ఈ చిన్న సమాచారం వల్ల ఇతర డ్రైవర్లకు ఆ రూట్ అలర్ట్స్ వెళ్లి అలర్ట్ అవుతారు లేదా జాగ్రత్త పడతారు.

### 6. వాయిస్ నావిగేషన్ ఆన్/ఆఫ్ చేయడం
ప్రతి టర్నింగ్ వచ్చే ముందు గూగుల్ మ్యాప్స్ మాట్లాడటం మీకు చిరాకుగా అనిపిస్తే, స్క్రీన్ కింద ఉండే స్పీకర్ ఐకాన్‌ను నొక్కి వాయిస్‌ను పూర్తిగా మ్యూట్ చేసుకోవచ్చు లేదా కేవలం ప్రమాదాలు, ట్రాఫిక్ జామ్స్ వంటి ముఖ్యమైన విషయాలు మాత్రమే చెప్పేలా 'ూశ్రీవతీం రాఅశ్రీఎ' మోడ్ పెట్టుకోవచ్చు. దీనికోసం స్క్రీన్ ముట్టుకోకుండా "ఓకే గూగుల్, మ్యూట్ వాయిస్ గైడెన్స్" అని చెప్తే కూడా సరిపోతుంది.

### 7. మీ జర్నీ వివరాలను షేర్ చేయడం
మీరు ఎక్కడికైనా వెళ్లేటప్పుడు, మీ ఇంట్లో వారికి లేదా ఫ్రెండ్స్ కి మీరు ఎక్కడి వరకు వచ్చారో వాట్సాప్ లేదా మెసేజ్ లో మాటిమాటికీ చెప్పాల్సిన అవసరం లేదు. నావిగేషన్ స్క్రీన్‌ను కింద నుండి పైకి స్వైప్ చేసి 'హష్ఘతీవ్ తీఅజూ జూతీశీస్త్రతీవం' ఆప్షన్ క్లిక్ చేస్తే చాలు. మీ లైవ్ లొకేషన్, మీరు వెళ్లే దారి, మీరు ఎన్ని గంటలకు చేరుకుంటారనే వివరాలు వారికి లైవ్‌లో కనిపిస్తూ ఉంటాయి. ఇది సేఫ్టీ పరంగా చాలా మంచి ఫీచర్.

### 8. ఆఫ్‌లైన్ మ్యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడం
సిగ్నల్ లేని అడవులు, కొండ ప్రాంతాలు లేదా రిమోట్ ఏరియాలకు వెళ్లేటప్పుడు ఈ ఫీచర్ మిమ్మల్ని కాపాడుతుంది. మీ ప్రొఫైల్ ఐకాన్ మీద క్లిక్ చేసి 'హటటశ్రీఱఅవ ఝఱజూం' లోకి వెళ్లి, మీకు కావలసిన సిటీ లేదా ఏరియాను ముందే డౌన్‌లోడ్ చేసి పెట్టుకోవచ్చు. దీనివల్ల ఇంటర్నెట్ లేకపోయినా నావిగేషన్, టర్న్ బై టర్న్ డైరెక్షన్లు పక్కాగా పనిచేస్తాయి.

### 9. ఒకే ట్యాప్‌తో రూట్ మార్చుకోవడం
సాధారణంగా గూగుల్ మ్యాప్స్ మనకు అత్యంత ఫాస్టెస్ట్ రూట్‌ను బ్లూ కలర్ రంగులో చూపిస్తుంది. కానీ, అదే గమ్యస్థానానికి వెళ్లే ఇతర అల్టార్నేటివ్ దారులను బూడిద రంగు గీతలతో చూపిస్తుంది. మీకు ఆ బూడిద రంగులో ఉన్న రూట్ నచ్చితే, దానిపై జస్ట్ ఒకసారి ట్యాప్ చేస్తే చాలు. వెంటనే మీ నావిగేషన్ కొత్త రూట్‌లోకి మారిపోతుంది. ఈ టిప్స్ మీ జర్నీని చాలా ఈజీ చేస్తాయి. మీరేం చేయకపోయినా, కనీసం మీ ఊరు/ ఉండే ప్రదేశంలో లేదా ఏరియా ఆఫ్‌లైన్ మ్యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసి పెట్టుకోండి. సిగ్నల్ లేనప్పుడు లేదా ఫోన్ సరిగ్గా పని చేయనప్పుడు ఇది మీకు చాల సహాయపడుతుంది.

# 16 రకాల కాంబినేషన్ మందులపై నిషేధం.. మీరు వాడుతున్నారా? లిస్ట్ చెక్ చేసుకోండి

**వీటితో మేలు కంటే హాని ఎక్కువని గుర్తించిన నిపుణుల కమిటీ**

న్యూఢిల్లీ: దేశీయంగా లభించే 16 రకాల ఫిక్స్‌డ్ -డోస్ కాంబినేషన్ (ఎఫ్‌డీసీ) ఔషధాల (రెండు లేదా అంతకంటే ఎక్కువ మందుల మిశ్రమం) పై కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిషేధం విధించింది. ఈ కాంబినేషన్ల వాడకానికి ఎటువంటి వైద్యపరమైన సైంటిఫిక్ ఆధారాలు లేవని, వీటితో ప్రయోజనం కంటే రిస్క్ ఎక్కువని నిపుణుల కమిటీ తేల్చడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్, 1940 లోని సెక్షన్ 26ఏ కింద ఈ నిషేధాన్ని విధిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది.




### నిషేధించిన ముఖ్యమైన మందులు
యాంటీబయాటిక్స్, నొప్పి నివారణ మందులు: అమోక్సిసిలిన్ ం సెరాటియోపెప్టిడేస్ మిశ్రమం, అమోక్సిసిలిన్ ం క్లోక్సాసిలిన్; పారాసిటమాల్ ం లిగ్నోకైన్; డైసైక్లోమైన్ ం పారాసిటమాల్ ం క్లిడినియం బ్రోమైడ్ వంటి కాంబినేషన్లు.

స్కిన్ కేర్ ప్రొడక్ట్స్: అలోవెరా/అలో ఎక్స్‌ట్రాక్ట్‌తో పాటు విటమిన్ ఇ, జోజోబా ఆయిల్, వీట్ జెర్మ్ ఆయిల్, టీ ట్రీ ఆయిల్ వంటివి కలిపి తయారుచేసే పలు డెర్మటోలాజికల్ లోషన్లు, క్రీములు.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ పరిశోధనల తర్వాతే ఈ చర్యలు తీసుకున్నారు. ప్రజా ఆరోగ్యాన్ని రక్షించడానికి,
మార్కెట్లో సైంటిఫిక్ ఆధారాలున్న మందులు మాత్రమే లభించేలా చూడటానికి
ఈ నిర్ణయం తోడ్పడుతుందని కేంద్రం తెలిపింది. ఈ ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని రాష్ట్రాల డ్రగ్ కంట్రోల్ విభాగాలను, తయారీదారులను ఆదేశించింది.

# జీసీసీలకు గ్లోబల్ హబ్‌గా భారత్..2 వేల సెంటర్లలో 19 లక్షల మందికి ఉద్యోగాలు



న్యూఢిల్లీ: ఇండియా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ (జీసీసీలకు) హబ్‌గా మారుతోంది. ప్రభుత్వం తీసుకున్న ఆర్థిక సంస్కరణలు, స్కిల్స్ ఉన్న యువత, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మెరుగవుతుండడమే ఇందుకు కారణం. గతంలో జీసీసీలు అంటే కేవలం మల్టీనేషనల్ కంపెనీలు (ఎంఎన్‌సీలు) ఖర్చులను తగ్గించుకోవడానికి ఏర్పాటు చేసే బ్యాక్-ఆఫీస్ సపోర్ట్ కేంద్రాలుగా మాత్రమే చూసేవారు. కానీ ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కన్సల్టెన్సీ కంపెనీ 'జేఎల్‌ఎల్ ఇండియా' రిపోర్ట్ ప్రకారం, ప్రస్తుతం భారత్‌లో 2 వేల కంటే ఎక్కువ జీసీసీలు ఉండగా, వీటిలో 19 లక్షల మందికి పైగా ప్రొఫెషనల్స్ పనిచేస్తున్నారు. ఈ కేంద్రాలు కేవలం సపోర్ట్ రోల్స్‌కే పరిమితం కాకుండా.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డెవలప్‌మెంట్, కోర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) వంటి టెక్నాలజీ ఇన్నోవేషన్స్‌కు వేదికలుగా మారాయి.

### ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లో సరికొత్త రికార్డు
జీసీసీలు వస్తుండడంతో రియల్ ఎస్టేట్ సెక్టార్ లాభపడుతోంది. 2025లోనే భారతదేశంలోని టాప్ 7 నగరాల్లో జరిగిన మొత్తం ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లో ఏకంగా 38 శాతం వాటాను జీసీసీలే దక్కించుకున్నాయి. రికార్డు స్థాయిలో 3.13 కోట్ల చదరపు అడుగుల ఆఫీస్ స్థలాన్ని ఇవి లీజుకు తీసుకున్నాయి. ఎంఎన్‌సీలు తమ ప్రధాన వ్యాపార సాఫ్ట్‌వేర్, ఆటోమేషన్, డిజిటల్ సేవలను భారత్ నుంచే నడిపిస్తున్నాయి. యూఎస్ హూస్టన్‌లోని భారత కాన్సులేట్ జనరల్ డీసీ మంజునాథ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇన్వెస్టర్ ఫ్రెండ్లీ పాలసీలు, ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్‌ఐ) వంటి పథకాలు డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, తయారీ రంగాలలో విదేశీ పెట్టుబడులను భారీగా ఆకర్షిస్తున్నాయన్నారు.

ఐసీఐసీఐ బ్యాంక్, కేబీఆర్ ప్రతినిధులు అతుల్ జైన్, యోగేష్ షెవాడే, నటాషా ఫ్రాస్టోలు మాట్లాడుతూ.. భారతదేశంలో టెక్నాలజీ, ఫైనాన్స్, హెల్త్‌కేర్, ఇంజనీరింగ్ రంగాలలో ప్రతి సంవత్సరం 100కు పైగా కొత్త జీసీసీలు ఏర్పాటు అవుతున్నాయని తెలిపారు. దేశంలో అందుబాటులో ఉన్న అపారమైన ఇంజనీరింగ్ టాలెంట్ పూల్, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న ప్రోత్సాహకాలు, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ భారత్‌ను గ్లోబల్ లీడర్‌గా నిలబెట్టాయని తెలిపారు.

### హైదరాబాద్ లో 400 జీసీసీలు
పెద్ద మొత్తంలో జీసీసీలను హైదరాబాద్ ఆకర్షిస్తోంది. తాజా రిపోర్ట్‌ల ప్రకారం, ఈ సిటీలో 350 నుంచి 400 కంటే ఎక్కువ సెంటర్లు పనిచేస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఏర్పాటవుతున్న కొత్త జీసీసీలలో దాదాపు 40 శాతానికి పైగా వాటాను దక్కించుకుంటూ హైదరాబాద్ దూసుకుపోతోంది. మైక్రోసాఫ్ట్, గూగుల్, జేపీ మోర్గన్ చేజ్, నోవార్టిస్, వెల్స్ ఫార్గో, మైక్రాన్ టెక్నాలజీ వంటి గ్లోబల్ దిగ్గజాలు ఇక్కడ భారీ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. తెలంగాణ ప్రభుత్వం జీసీసీలను ఆకర్షించడానికి సరికొత్త "తెలంగాణ జీసీసీ పాలసీ" ని అమలు చేస్తోంది. అర్హత గల ప్రాజెక్టుల పెట్టుబడులపై సుమారు 30శాతం వరకు క్యాపిటల్ సబ్సిడీని అందిస్తోంది. సింగిల్ విండో సిస్టమ్ అయిన టీఎస్ ఐపాస్ ద్వారా కేవలం 15 రోజుల్లోనే అవసరమైన అన్ని రకాల ప్రభుత్వ అనుమతులను ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో మంజూరు చేస్తోంది.

# బంగారానికి ఏమైంది? ఆల్-టైమ్ హై నుండి అగాధంలోకి రేట్లు.. ఇంకా తగ్గుతాయా?




**బంగారం కేవలం ఒక పెట్టుబడే కాదు ఎమోషన్ కూడా ఇండియన్ ఫ్యామిలీస్ కి. 2025లో ఏకంగా 65% బంపర్ రిటర్న్స్ ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచిన గోల్డ్.. 2026కు వచ్చేసరికి మాత్రం ఇన్వెస్టర్లకు చుక్కలు చూపిస్తోంది. ఈ ఏడాది ఫస్ట్ హాఫ్‌లోనే గోల్డ్ రిటర్న్స్ మైనస్ 4 శాతానికి పడిపోయి షాక్ ఇచ్చింది. జనవరిలో సరికొత్త రికార్డులను సృష్టించిన బంగారం.. ఇప్పుడు ఎందుకు చతికిలపడింది? అసలు మార్కెట్లో ఏం జరుగుతోంది? బంగారం మళ్లీ పుంజుకుంటుందా లేదా అనే ప్రశ్నలకు జవాబు చూద్దాం రండి...**

### ఆల్-టైమ్ హై నుండి అగాధంలోకి..
2026 ప్రారంభం బంగారం మార్కెట్‌కు చాలా అద్భుతంగా దొరికింది. అక్టోబర్ 2022 నుంచి మొదలైన బుల్ రన్ జోష్‌లో.. ఈ ఏడాది జనవరి చివరి నాటికి గోల్డ్ ప్రైస్ 5వేల 602 డాలర్ల ఆల్-టైమ్ హై రికార్డును తాకింది. ఆ తర్వాత మిడిల్ ఈస్ట్ సంక్షోభం తెరపైకి రావడంతో సీన్ మొత్తం రివర్స్ అయింది. యుద్ధ వాతావరణం వల్ల మార్కెట్లలో లిక్విడిటీ కొరత ఏర్పడింది. దీంతో లాభాలను మూటగట్టుకోవడానికి ఇన్వెస్టర్లు బంగారం, వెండిని పెద్ద ఎత్తున అమ్మడం ప్రారంభించారు. ఫలితంగా జూన్ 10 నాటికి గోల్డ్ రేట్ ఏకంగా 28% పడిపోయి 4వేల డాలర్ల వార్షిక కనిష్టానికి పడిపోయింది. ప్రస్తుతం గోల్డ్ 4వేల144 డాలర్ల దగ్గర ఊగిసలాడుతోంది.

### గోల్డ్ ఎందుకు పెరగట్లేదు?
అమెరికా-ఇరాన్ మధ్య హోర్ముజ్ జలసంధి ఓపెనింగ్ ఒప్పందం తర్వాత క్రూడ్ ఆయిల్ ధరలు దాదాపు 15% వరకు తగ్గాయి. మరి ఆయిల్ రేట్లు తగ్గినప్పుడు బంగారం ధరలు పెరగాలి కదా? కానీ ఇక్కడే ఒక ట్విస్ట్ ఉంది. ప్రస్తుతం మార్కెట్‌ను శాసిస్తోంది జియోపొలిటికల్ టెన్షన్స్, ఆయిల్ ధరలు కాదు.. అమెరికా సెంట్రల్ బ్యాంక్ వడ్డీ రేట్లు. జూన్ 17న జరిగిన యూఎస్ ఫెడ్ మీటింగ్‌లో కొత్త చైర్మన్ కెవిన్ వార్ష్ కీలక ప్రకటన చేశారు. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి 2026లో కనీసం ఇంకొకసారైనా వడ్డీ రేట్లను పెంచుతామని హింట్ ఇచ్చారు. పైగా ఎలాంటి ముందస్తు గైడెన్స్ ఇవ్వకపోవడంతో మార్కెట్లో అనిశ్చితి పెరిగి, బంగారంపై తీవ్ర ఒత్తిడి పడింది.

### కింగ్‌లా దూసుకుపోతున్న డాలర్ ఇండెక్స్..
బంగారానికి, అమెరికా డాలర్‌కు ఎప్పుడూ రివర్స్ రిలేషన్ ఉంటుంది. డాలర్ పుంజుకుంటే బంగారం పడిపోతుంది. 2025లో 12% బలహీనపడిన డాలర్ ఇండెక్స్, 2026లో మాత్రం 2.6% పైగా పుంజుకుని 100 మార్కును దాటేసింది. వడ్డీ రేట్లు ఎక్కువ కాలం పాటు అలాగే ఉంటాయనే భయంతో ఇన్వెస్టర్లు బంగారం వైపు కాకుండా డాలర్ వైపు మొగ్గు చూపుతున్నారు. అందుకే వడ్డీ ఆదాయం ఇవ్వని గోల్డ్ పై ఆకర్షణ తగ్గింది.

మరి గోల్డ్ బుల్ రన్ ముగిసిపోయినట్లేనా? అంటే ప్రశ్నకు నిపుణులు మిశ్రమంగా స్పందిస్తున్నారు. ఒకవేళ ద్రవ్యోల్బణం తగ్గి, ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గిస్తే బంగారం మళ్లీ రాకెట్‌లా దూసుకుపోవచ్చు. ఒకవేళ ద్రవ్యోల్బణం ఇలాగే కొనసాగినా.. సురక్షితమైన పెట్టుబడిగా గోల్డ్‌కు డిమాండ్ పెరుగుతుంది. ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంకులు ఇప్పటికీ బంగారాన్ని భారీగా కొనుగోలు చేస్తూనే ఉన్నాయి. కాబట్టి సామాన్య ఇన్వెస్టర్లు మార్కెట్ టైమింగ్స్ గురించి టెన్షన్ పడకుండా, తమ పోర్ట్‌ఫోలియోలో 5 నుండి 10 శాతం వరకు బంగారం వెండికి చోటు కల్పించటం లాంగ్ టర్మ్ గోల్స్‌కు ఎల్లప్పుడూ సేఫ్ బెట్ అంటున్నారు నిపుణులు.

# కియా కారు కొనే ప్లాన్ ఉందా? అయితే ఇప్పుడే డిసైడ్ అవ్వండి.. పెరగనున్న ధరలు!




దకియా కార్ కొనుక్కోవాలని ప్లాన్ చేస్తున్నారా? అయితే మీకో అర్జెంట్ అప్‌డేట్. కియా ఇండియా తన కార్ల ధరలను పెంచుతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. వచ్చే నెల అంటే జూలై 1, 2026 నుండి కియా తన అన్ని కార్ల మోడల్స్, వేరియంట్ల ధరలు 2 శాతం వరకు పెంచుతోంది. పెరిగిన తయారీ ఖర్చులు, పెరిగిన రా మెటీరియల్ ధరలు, ఆపరేషన్ ఖర్చుల వల్లే ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదని కంపెనీ స్పష్టం చేసింది.

వాస్తవానికి గత కొంత కాలంగా ఆటోమొబైల్ రంగానికి తయారీ ఖర్చులు భారంగా మారాయి. అయినా కస్టమర్లపై పూర్తి భారం పడకుండా ఉండటానికి తామే చాలా వరకు ఆ నష్టాన్ని భరించామని, కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ధరల సర్దుబాటు తప్పడం లేదని కియా ఇండియా చెబుతోంది. అయితే ఈ ధరల పెంపు అనేది అన్ని కార్లపై ఒకేలా ఉండదు. కస్టమర్లు ఎంచుకునే మోడల్ వేరియంట్‌ను బట్టి ఈ 2% పరిధిలో మార్పులు ఉంటాయి. ఇది కేవలం కియా కంపెనీ ముచ్చట మాత్రమే కాదు.. ప్రస్తుతం ఆటోమొబైల్ ఇండస్ట్రీ మొత్తం ఇదే ట్రెండ్ ఫాలో అవుతోంది. ఇటీవలే ఆటోమొబైల్ దిగ్గజం 'టాటా మోటార్స్' కూడా తమ కమర్షియల్ వాహనాల ధరలను జూలై 1, 2026 నుండి 2.5 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ముడిసరుకుల ధరలు, లాజిస్టిక్స్ ఖర్చులు విపరీతంగా పెరగడమే దీనికి ప్రధాన కారణంగా టాటా గ్రూప్ చెప్పింది. సో ఒకవేళ మీరు కియా సెల్టోస్, సోనెట్ లేదా ఇన్నోవేటివ్ ఈవీ కార్లను ఇంటికి తెచ్చుకోవాలనుకుంటే.. జూలై 1 లోపు బుక్ చేసుకోవడమే బెస్ట్ ఐడియా.

# మొటిమంత బెంగ

**ముఖం మీద చిన్న మొటిమ కనిపిస్తే చాలు. గిల్లేంతవరకూ కొందరికి చేయి ఆగదు. గట్టిగా నలిపి పిండేసేంత వరకూ నిద్ర పట్టదు. నిజానికి మొటిమలు ఆరోగ్యానికేమీ హాని చేయవు. చాలావరకివి వాటంతటవే తగ్గుతాయి. మరీ ఎక్కువగా, పెద్దగా అయితే చూడటానికి కాస్త ఇబ్బంది కలిగిస్తాయంతే. కానీ కొందరు.. ముఖ్యంగా యుక్తవయసువారు చిన్న మొటిమ కనిపించినా పెద్ద సమస్యగా భావిస్తారు.**

**ఇది మొటిమల అవగాహన మాసం**

ముఖం మీద చిన్న మొటిమ కనిపిస్తే చాలు. గిల్లేంతవరకూ కొందరికి చేయి ఆగదు. గట్టిగా నలిపి పిండేసేంత వరకూ నిద్ర పట్టదు. నిజానికి మొటిమలు ఆరోగ్యానికేమీ హాని చేయవు. చాలావరకివి వాటంతటవే తగ్గుతాయి. మరీ ఎక్కువగా, పెద్దగా అయితే చూడటానికి కాస్త ఇబ్బంది కలిగిస్తాయంతే. కానీ కొందరు.. ముఖ్యంగా యుక్తవయసువారు చిన్న మొటిమ కనిపించినా పెద్ద సమస్యగా భావిస్తారు. తెగ ఆందోళన పడిపోతుంటారు. మనో వేదనకూ గురవుతుంటారు. మొటిమల మీద లెక్కలేనన్ని అపోహలూ రాజ్యమేలుతుండటం, సరైన అవగాహన లేకపోవటమే దీనికి కారణం.

అప్పటివరకూ నునుపుగా ఉన్న ముఖం మీద ఏంటీ మొటిమలు? ఒకట్రెండు కాస్తా చూస్తుండగానే సంఖ్య పెరుగుతూ వస్తోందేంటి? అందానికి, ఆకర్షణకు అత్యంత ప్రాధాన్యమిచ్చే యుక్తవయసువారిలో ఇలాంటి ఆలోచనలే ముసురుకుంటుంటాయి. ఇంతకీ ఇవి ఎలా పుట్టుకొస్తాయి? ఆశ్చర్యంగా అనిపించినా చర్మం నిగనిగలాడుతూ కనిపించటానికి తోడ్పడే చమురు గ్రంథులే మొటిమలకు కారణం! శరీరం మీద చర్మం అంతటా సన్నటి వెంట్రుకలు, వాటి కుదుళ్లుంటాయి. ప్రతి కుదురులో వెంట్రుక మొదలు (ఫాలికల్), చమురు గ్రంథులు (సెబేషియస్ గ్లాండ్స్) ఉంటాయి. గ్రంథుల నుంచి ఉత్పత్తయ్యే చమురు సన్నటి రంధ్రాల ద్వారా బయటకు వస్తుంది. ముఖం, ఛాతీ, వీపు, భుజాలు, చేతుల మీద ఈ గ్రంథులు పెద్ద సంఖ్యలో ఉంటాయి. ఇవి వాచి, ఉబ్బి.. గుల్లల మాదిరిగా పైకి పొడుచుకు రావటమే మొటిమలకు మూలం. కొందరిలో జన్యుపరంగా టెస్టోస్టిరాన్ వంటి లైంగిక హార్మోన్లు గ్రంథులను ప్రేరేపితం చేయటం వల్ల మరింతగా చమురు ఉత్పత్తి అవుతుంది. మరోవైపు చర్మ రంధ్రాల్లో ప్రొపిని బ్యాక్టీరియం ఆక్నిస్ అనే బ్యాక్టీరియా చమురును కొవ్వు ఆమ్లాలుగా విడగొడుతుంటుంది. ఈ ఆమ్లాలు వెంట్రుక కుదురును ప్రేరేపించే క్రమంలో కెరటిన్ పదార్థం ఎక్కువగా ఉత్పత్తి అయ్యి, చర్మ రంధ్రాలు మూసుకుపోవచ్చు. దీంతో అక్కడ ఉబ్బుగా, గుల్ల మాదిరిగా ఏర్పడి.. మొటిమ తలెత్తుతుంది. ఇది క్రమంగా పెద్దగా అవుతూ రావొచ్చు. కొన్నిసార్లు చర్మ రంధ్ర మార్గం పగిలి, వాపు మొదలవ్వచ్చు. ఫలితంగా అక్కడ ఎర్రబడి, మొటిమ పొక్కులా పొడుచుకొస్తుంది. లోపల చీము చేరటం, చితకటం, గుంతలు పడటం.. అన్నీ దీని పర్యవసానాలే.

**నాలుగు రకాలు**

సాధారణంగా మనం మొటిమలన్నింటినీ ఒకే గాటన కట్టేస్తుంటాం. కానీ తెలుపు లేదా నలుపు గుల్లలు (బ్లాక్‌హెడ్స్, వైట్‌హెడ్స్), చీము గుల్లలు (పశ్చులే), తిత్తులు (సిస్ట్స్).. ఇలా మొటిమలు రకరకాలుగా ఉంటాయి. తీవ్రతను బట్టి వీటిని నాలుగు రకాలుగా చెప్పుకోవచ్చు.

**గ్రేడ్ 1:** చాలా సన్నగా, చిన్నగా ఉండేవి (కొమెడోన్స్). వైట్‌హెడ్స్, బ్లాక్‌హెడ్స్ ఇలాంటివే.

**గ్రేడ్ 2:** బ్లాక్‌హెడ్స్ ఇన్‌ఫెక్షన్‌కు గురై, చీము పట్టడం (పశ్చు లర్).

**గ్రేడ్ 3:** గుల్లలు ఇన్‌ఫెక్షన్‌తో వాచి, గడ్డ మాదిరిగా అవటం (నాడ్యులర్).

**గ్రేడ్ 4:** గడ్డ మరీ పెద్దగా, లావుగా ఉబ్బటం (నాడ్యులోసిస్టిక్).

ఆడవారిలో ఎక్కువ

మగవారిలో కన్నా ఆడవారికి మొటిమలు ఎక్కువగా వచ్చే అవకాశముంది. ఎందుకంటే వీరిలో హార్మోన్ల వ్యత్యాసాలు ఎక్కువ. ఆడవారిలో అండాశయాల్లో నీటి తిత్తులు (పీసీఓఎడీ), నెలసరి సరిగా రాకపోవటం, థైరాయిడ్ పనితీరు దెబ్బతినటం, టెస్టోస్టిరాన్ హార్మోన్ మోతాదులు అస్తవ్యస్తం కావటం వంటివీ మొటిమలు ఎక్కువగా వచ్చేలా చేయొచ్చు.

ఏ వయసులోనైనా..

మొటిమలు యుక్తవయసులోనే వస్తుంటాయని, ఆ తర్వాత వాటంతటవే పోతాయని చాలామంది భావిస్తుంటారు. నిజానికి వీటికి ఒక వయసంటూ లేదు. శిశువుల దగ్గరి నుంచి వృద్ధుల వరకూ ఎవరికైనా రావొచ్చు. కానీ సగటున 10–25 ఏళ్ల వయసులో ఎక్కువగా చూస్తుంటాం. అలాగని అక్కడితోనే ఆగిపోతాయని కచ్చితంగా చెప్పలేం. కొందరికి 20ల్లో, 30ల్లో, 40ల్లోనూ రావొచ్చు. కొందరు మహిళలకు యుక్తవయసులో కొద్దిగానే మొటిమలు వచ్చినా పెద్దయ్యాక తీవ్రంగానూ వేధించొచ్చు.



**ముఖం మీదే కాదు..**

మొటిమలు చాలావరకూ.. 99% ముఖం మీదే వస్తుంటాయి. నుదురు, బుగ్గలు, ముక్కు మీద ఇవి కనిపిస్తుంటాయి. చమురు గ్రంథులు లేకపోవటం వల్ల పెదవులు, పెదవుల పైభాగంలో మాత్రం రావు. కొందరికి ముఖం మీదే కాదు.. ఛాతీ, వీపు, చేతుల మీద కూడా రావొచ్చు.

**గిల్లితే తగ్గవు**

మొటిమలను గిల్లి, నొక్కి పిండితే త్వరగా తగ్గుతాయని కొందరు అనుకుంటుంటారు. ఇది నిజం కాదు. గిల్లితే మొటిమలు మరింత స్పష్టంగా కనిపిస్తాయి. శాశ్వతంగా మచ్చలు పడొచ్చు. ఇన్‌ఫెక్షన్ మరింత లోతుకు చొచ్చుకెళ్లి ముఖం మీద గుంతలు పడే ప్రమాదముంది. ఒకసారి గుంత పడితే పూర్తిగా మామూలు స్థాయికి తీసుకొచ్చే చికిత్సలేవీ లేవు. కాకపోతే గుంతల లోతును తగ్గించి, అంతగా కనిపించకుండా చేయొచ్చు.

**గట్టిగా రుద్ది కడిగితే పోవు**

ముఖాన్ని గట్టిగా, రుద్ది కడిగితే మొటిమలు పోతాయనుకోవటం అపోహ. దీంతో మొటిమలు తగ్గటం అటుంచి, మరింత ఎక్కువవుతాయి. ఇన్‌ఫెక్షన్ లోపలికి వెళ్లిపోయి, గుంతలు పడే అవకాశముంది. గట్టిగా రుద్దటం కన్నా రోజుకు రెండు సార్లు మృదువుగా తేలికైన, పరిమళం లేని క్లీన్సర్‌తో ముఖాన్ని కడుక్కోవటం మంచిది. వేలి చివర్లతో క్లీన్సర్‌ను ముఖానికి రాసుకోవాలి. అనంతరం గోరువెచ్చటి నీటితో కడుక్కోవాలి.

కొందరు చర్మం రంధ్రాలు విప్పారతాయనే భావనతో ఆవిరి స్నానాలు చేస్తుంటారు. కానీ వీటితో మొటిమలు మరింత ఎక్కువవుతాయి.

**ఆహారంతో పరోక్ష సంబంధం**

రాత్రిపూట జంక్‌ఫుడ్ తిన్నా.. ఎక్కువ కేలరీల ఆహారం తిన్నా మొటిమలు ఎక్కువగా పుట్టుకురావొచ్చు. ఎందుకంటే శరీరం వాడుకోకుండా మిగిలిన కేలరీలు ఒంట్లో కొవ్వుగా మారతాయి. వీటి నుంచి టెస్టోస్టిరాన్ వంటి లైంగిక హార్మోన్లు పుట్టుకొచ్చి మొటిమలను ప్రేరేపిస్తాయి. అందువల్ల సాయంత్రం ఆరు గంటల తర్వాత జంక్‌ఫుడ్, పెద్దమొత్తంలో పిండి పదార్థాలు.. పాల పదార్థాలు (పెరుగు మినహాయించి) తీసుకోవటం మానెయ్యాలి. స్వీట్లు, చాక్లెట్లు, కొవ్వు పదార్థాల వంటివి తగ్గించుకోవాలి.

ఆరోగ్యకరమైన ఆహారంతో మొటిమల తీవ్రతను తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా విటమిన్ ఏతో కూడిన పాలు (పగటిపూట), క్యారెట్, క్యాబేజీ, చిలగడ దుంపలు.. ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు గల చేపలు, అక్రోట్లు.. జింక్‌తో కూడిన పదార్థాలు మొటిమలు ఉద్ధృతం కాకుండా కాపాడతాయి.

**పౌడర్ కారణం కాదు**

కొందరు ముఖానికి పౌడర్ రాసుకుంటే చర్మ రంధ్రాలు మూసుకుపోయి మొటిమలు వస్తాయని భావిస్తుంటారు. ఇది అపోహే. కాకపోతే గాఢమైన కెమికల్ పీల్స్‌తో చమురు గ్రంథులు ఇంకాస్త పెద్దగా అవ్వచ్చు. ఫలితంగా మొటిమలు ఉద్ధృతమవుతాయి. కొన్ని స్టెరాయిడ్ క్రీములతోనూ ఇవి ఎక్కువ కావొచ్చు. కాబట్టి కెమికల్ పీల్స్ వాడకపోవటం మంచిది. సన్‌స్క్రీన్, మాయిశ్చరైజర్లయినా సరే.. నాన్ కొమెడోజెనిక్ రకానికి చెందినవే ఉపయోగించాలి.

**ఒత్తిడికి దూరంగా**

మానసిక ఒత్తిడి, ఆందోళనలు మొటిమలకు కారణం కాకపోయినా అప్పటికే ఉన్నవి ఉద్ధృతమయ్యే అవకాశముంది. కాబట్టి మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలి. ధ్యానం, ప్రాణాయామం చేయాలి.

**చికిత్స అవసరమా?**

మొటిమలు ఆరోగ్యానికేమీ హాని కలిగించవు. కానీ వీటితో గుంతలు పడితే జీవితాంతం అలాగే ఉంటాయి. కాబట్టి చికిత్స తీసుకోవటం మంచిది. కొత్తగా మొటిమలు వస్తున్నా పెద్దగా ఆందోళన అవసరం లేదు. కానీ ఉన్నవి తగ్గకపోతుంటే మాత్రం చికిత్స అవసరం. అలాగే చీము పట్టటం, గడ్డలు ఏర్పడటం, ముఖమంతా నల్లటి మచ్చల్లా మారుతున్నా తాత్సారం చేయరాదు. చికిత్స ఉద్దేశం– మొటిమలు ఉద్ధృతం కాకుండా చూడటం.. తీవ్ర స్థాయి నుంచి స్వల్ప స్థాయికి తీసుకురావటం. సాధారణంగా ఒక వయసు వచ్చేసరికి మొటిమలు నియంత్రణలోకి వస్తాయి. అప్పటివరకూ డాక్టర్ పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటే గుంతలు, మచ్చలు పడకుండా చూసుకోవచ్చు.

**ఏంటీ చికిత్స**

మామూలు వైట్, బ్లాక్‌హెడ్స్‌కు రెటినాల్ క్రీములు మేలు. ఇవి గడ్డకట్టిన కెరటిన్ విడిపోయేలా, చర్మ రంధ్రాలు తెరచుకునేలా చేస్తాయి.

చీము పడితే డాక్సీసైక్లిన్, అజిత్రోమైసిన్ వంటి యాంటీబయాటిక్స్ ఇవ్వాల్సి ఉంటుంది.

మరీ తీవ్ర మొటిమలకు రెటినాయిడ్, విటమిన్ ఏ మాత్రలు ఉపయోగపడతాయి. ఇవి చమురు ఉత్పత్తిని తగ్గించి, రంధ్రాలు తిరిగి తెరచుకునేలా చేస్తాయి. అయితే వీటిని 21 నుంచి 25 ఏళ్ల మధ్య వయసువారికే ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు డాక్టర్ సలహా తీసుకోకుండా తమకు తామే విటమిన్ ఏ మాత్రలను వేసుకోవటం ఎక్కువైంది. ఇది ప్రమాదకరం. యుక్తవయసులో ఇవి ఎదుగుదలను, చూపును దెబ్బతీయొచ్చు. సంతానం కోసం ప్రయత్నిస్తున్నవారు, గర్భిణులు, బాలింతలు వీటిని వాడటం మంచిది కాదు. కాబట్టి రక్త పరీక్ష చేయించుకొని, డాక్టర్ పర్యవేక్షణలోనే ఒక వయసు వచ్చేవరకూ వాడి, మానెయ్యాలి.

రెటినాల్ క్రీములు పడనివారికి శాల్సిలిక్ యాసిడ్ పీల్స్ మేలు చేస్తాయి.

మందులతో ఫలితం కనిపించవారికి, మందులు వాడటం కుదరనివారికి లేజర్ చికిత్సతో ఫలితం కనిపిస్తుంది. చికిత్సలతో రాత్రికి రాత్రే మొటిమలు తగ్గుతాయని అనుకోవద్దు. ఇవి పని చేయటానికి 4–8 వారాలు పడుతుంది.

**మచ్చలు, గుంతలు పడితే?**

మొటిమలతో మచ్చలు, గుంతలు పడితే చర్మం రకం, వయసు, జీవనశైలి, మచ్చల రకాన్ని బట్టి డెర్మారోలర్, కెమికల్ పీల్, మైక్రోనీడ్లింగ్ రేడియో ఫ్రీక్వెన్సీ, ఫ్రాక్షనల్ సీవో2 లేజర్, ఎర్బియం యాగ్ లేజర్.. వీటిల్లో ఏదో ఒకదాంతో చికిత్స చేయొచ్చు. లేజర్లు చర్మం కిందుండే కొలాజెన్‌ను దెబ్బతీస్తాయి. తర్వాత అక్కడ కొత్త కొలాజెన్ ఏర్పడుతుంది. ఈ క్రమంలో మచ్చలు, గుంతలు తగ్గుతాయి. అయితే గుంతలు పూర్తిగా పోవని గుర్తించాలి. 60–70% మాత్రమే పూడతాయి. గుంతలు ముఖానికి ఇబ్బంది కలిగించటం లేదని అనుకునేంతవరకూ చికిత్స తీసుకోవచ్చు.



## గురకకు మాత్ర

జ్వరం మాత్ర మాదిరిగా గురకకూ ఓ మాత్ర ఉంటే బాగుంటుంది కదా. నిద్రలో కాసేపు శ్వాసకు ఆటంకం కలిగించే స్లీప్ అప్నియాతో బాధపడే చాలామంది ఇలాగే అనుకుంటారు. రోజూ ముఖానికి సీప్యాప్ పరికరం ధరించటం తప్పుతుంది మరి. నిజంగా పరిశోధకులు అలాంటి మాత్రే రూపొందించారు. దీని పేరు ఏడీ109. ఆరాక్సీబ్యుటీనిన్, ఆటమోజెటిన్ అనే మందులను కలిపి తయారుచేసిన ఇది మంచి ఫలితం చూపిస్తున్నట్టు మూడో దశ ప్రయోగ పరీక్షలో బయటపడింది. దీన్ని వాడిన వారిలో అప్నియా తీవ్రత 44% వరకు తగ్గినట్టు తేలింది. సుమారు 42% మందిలో తీవ్ర సమస్య కాస్తా ఒక మాదిరి సమస్యగా మారింది కూడా. దాదాపు 18% మందిలో గురక లక్షణాలేవీ కనిపించకపోవటం గమనార్హం.

## గుండెకు బెండ అండ



బెండకాయ అనగానే జిగురుగా ఉంటుందని చాలామంది వద్దంటుంటారు. నిజానికి దీనిలో గుండె ఆరోగ్యానికి, గ్లూకోజు తగ్గటానికి, జీర్ణక్రియ సజావుగా సాగటానికి తోడ్పడే పోషకాలెన్నో ఉంటాయి. ఇందులో కొలెస్ట్రాల్ అసలే ఉండదు. అరకప్పు ఉడికించిన బెండకాయలో 6 గ్రా. పిండి పదార్థాలు, 6 కేలరీలు, 2 గ్రా. పీచు, 5 గ్రా. ప్రొటీన్, 8 మి.గ్రా. సోడియం, 8 మైక్రో గ్రా. ఫోలేట్, 32 మైక్రో గ్రా. విటమిన్ కె, 6 మి.గ్రా. క్యాల్షియం, 8 మి.గ్రా. మెగ్నీషియం, 13 మి.గ్రా. విటమిన్ సి, 2 మి.గ్రా. మ్యాంగనీసు ఉంటాయి. రోజూ బెండకాయ తినేవారిలో ట్రైగ్లిజరైడ్లు, మొత్తం కొలెస్ట్రాల్, ఎల్‌డీఎల్ (చెడ్డ కొవ్వు), రక్తంలో గ్లూకోజు మోతాదులు తక్కువగా ఉంటున్నట్టు 9 ప్రయోగ పరీక్షల సమీక్ష చెబుతోంది. అంతేకాదు, హెచ్‌డీఎల్ (మంచి కొవ్వు) గణనీయంగా పెరుగుతుండటం విశేషం. ఇవన్నీ గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచేవే. బెండకాయలోని వృక్ష రసాయనాలు విశృంఖల కణాల (ఫ్రీ రాడికల్స్) ఉద్ధృతి తగ్గటానికి తోడ్పడతాయి. ఇలా వాపు ప్రక్రియను అదుపులో పెట్టి, క్యాన్సర్ల ముప్పు తగ్గటానికి దోహదం చేస్తాయి. అలాగే రక్తపోటునూ అదుపులో పెడతాయి. బెండలోని పీచు పదార్థం చక్కెర, పిండి పదార్థాలను త్వరగా జీర్ణం కాకుండా అడ్డుకోవటం ద్వారా రక్తంలో గ్లూకోజు మోతాదులు నియంత్రణలో ఉండేలా చూస్తుంది.

ఇందులో జిగురు ద్రవంలాంటి పెక్టిన్ అనే పీచు దండిగా ఉంటుంది. ఇది పేగుల్లో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందటానికి తోడ్పడుతుంది. అందువల్ల మలబద్ధకం గలవారికి మేలు చేస్తుంది. పెద్ద పేగు క్యాన్సర్ ముప్పునూ తగ్గిస్తుంది.

## సిగరెట్లు అప్పుడప్పుడు కాల్చినా తీవ్ర జబ్బుల ముప్పు



సిగరెట్లు రోజూ, చాలా ఏళ్లుగా తాగితేనే ఆరోగ్యానికి హానికరమని చాలామంది భావిస్తుంటారు. వారాంతాల్లోనో, వేడుకల్లోనో, ఒత్తిడికి గురైనప్పుడో ఒకటీ అరా కాల్చితే పెద్దగా ఇబ్బందేమీ ఉండదని అనుకుంటుంటారు. కానీ ఇలా అప్పుడప్పుడూ సిగరెట్లు కాల్చటమూ తీవ్ర జబ్బుల ముప్పు పెరగటానికి కారణమవుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. పొగాకులో క్యాన్సర్ కారకాలు, విషతుల్య పదార్థాల వంటి 7వేలకు పైగా రసాయనాలుంటాయి. రోజూ తాగేవారికీ, అప్పుడప్పుడూ కాల్చేవారికీ మధ్య మోతాదులో తేడా ఉండొచ్చు గానీ హాని కారకాల ప్రభావం విషయంలో శరీరం ఈ వ్యత్యాసాన్ని విడమరచుకోలేదు. ఒకటి అరా కాల్చినా కీలక అవయవాలు, వ్యవస్థల మీద ప్రభావం పడుతుంది. పొగాకు నుంచి వెలువడే పొగకు గుండె రక్తనాళాల వ్యవస్థ అతిగా స్పందిస్తుంది. పొగ తాగిన మరుక్షణంలోనే రక్తనాళాలు సంకోచిస్తాయి. గుండె వేగం, రక్తపోటు పెరుగుతాయి.పొగలోని కార్బన్‌మోనాక్సైడ్ మూలంగా రక్తంలో ప్రసారమయ్యే ఆక్సిజన్ స్థాయులు తగ్గుతాయి. దీంతో గుండె మరింత బలంగా పనిచేయాల్సి వస్తుంది. అసలే పొగ అలవాటులేని వారితో పోలిస్తే అప్పుడప్పుడు సిగరెట్లు తాగినవారికీ గుండె జబ్బు ముప్పు గణనీయంగా పొంచి ఉంటున్నట్టు పరిశోధనలు చెబుతున్నాయి. వీరికి గుండెపోటు ముప్పే కాదు.. పక్షవాతం, రక్తనాళాల లోపలి గోడ పొర దెబ్బతినటం, రక్తనాళాల్లో త్వరగా పూడికలు ఏర్పడటం, రక్తం గడ్డలు ఏర్పడటం వంటి ప్రమాదాలూ ఎక్కువే. లక్షణాలు బయటపడే సరికే లోపల జరగాల్సిన అనర్థం జరిగిపోతుంది. ఒక్క గుండె మాత్రమేనా? ఊపిరితిత్తులూ దెబ్బతింటాయి. క్యాన్సర్ల ముప్పూ పెరుగుతుంది. కాబట్టి సిగరెట్లు, చుట్టలు, బీడీల విషయంలో సురక్షితమైన మోతాదంటూ ఏదీ లేదని గుర్తుంచుకోవాలి.

# టీ20 క్రికెట్‌లో కొత్త రారాజు.. గేల్ ను అధిగమించిన పొలార్డ్

- టీ20 క్రికెట్‌లో క్రిస్ గేల్ రికార్డును బద్దలుకొట్టిన కీరన్ పొలార్డ్
- మేజర్ లీగ్ క్రికెట్‌లో సెంచరీతో ఈ ఘనత సాధించిన విండీస్ ఆల్‌రౌండర్
- 14,562 పరుగుల గేల్ రికార్డును దాటి 14,582 పరుగులతో అగ్రస్థానానికి
- పదేళ్లకు పైగా అగ్రస్థానంలో కొనసాగిన గేల్ ఆధిపత్యానికి ముగింపు
- టీ20ల్లో 10,000 పరుగులు, 300 వికెట్లు తీసిన ఏకైక ఆటగాడిగా రికార్డ్




**హైదరాబాద్ పెన్ పవర్:** వెస్టిండీస్ విధ్వంసకర ఆల్‌రౌండర్ కీరన్ పొలార్డ్ టీ20 క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఇప్పటివరకు ఈ రికార్డును తన పేరిట ఉంచుకున్న సహచర ఆటగాడు క్రిస్ గేల్‌ను పొలార్డ్ అధిగమించాడు. మేజర్ లీగ్ క్రికెట్ (మీజ) 2026 సీజన్‌లో భాగంగా ఆదివారం ఈ ఘనత సాధించాడు.

డల్లాస్‌లో వాషింగ్టన్ ఫ్రీడమ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఎంఐ న్యూయార్క్ తరఫున ఆడిన పొలార్డ్, అజేయ శతకంతో (100ి పరుగులు, 56 బంతుల్లో) చెలరేగాడు. ఈ ఇన్నింగ్స్‌తో అతను టీ20ల్లో తన మొత్తం పరుగుల సంఖ్యను 14,582కు పెంచుకున్నాడు. దీంతో, 14,562 పరుగులతో పదేళ్లకు పైగా (4,463 రోజులు) అగ్రస్థానంలో ఉన్న క్రిస్ గేల్ రికార్డు బద్దలైంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్టు 245 పరుగులు చేయగా, పొలార్డ్ సెంచరీ చేసినప్పటికీ ఎంఐ న్యూయార్క్ 215 పరుగులకే పరిమితమై ఓటమిపాలైంది. 39 ఏళ్ల పొలార్డ్ తన సుదీర్ఘ కెరీర్‌లో 736 టీ20 మ్యాచ్‌లు ఆడి ఈ మైలురాయిని చేరుకున్నాడు. టీ20 క్రికెట్‌లో 10,000కు పైగా పరుగులు, 300కు పైగా వికెట్లు పడగొట్టిన ఏకైక ఆటగాడిగానూ అతనికి అరుదైన రికార్డు ఉంది. ఎక్కువగా ఫినిషర్ పాత్ర పోషించే అతను, నెం.5 లేదా ఆ తర్వాతి స్థానాల్లో బ్యాటింగ్‌కు వచ్చి 10,000కు పైగా పరుగులు చేయడం విశేషం. ఈ వయసులోనూ అత్యున్నత స్థాయిలో రాణిస్తూ పొలార్డ్ తన ప్రత్యేకతను చాటుకుంటున్నాడు.

**టీ20 క్రికెట్‌లో పరుగుల వీరులు వీళ్లే..**

కీరన్ పొలార్డ్: 14,582 పరుగులు (736 మ్యాచ్‌లు)
క్రిస్ గేల్: 14,562 పరుగులు (463 మ్యాచ్‌లు)
అలెక్స్ హెల్స్: 14,449 పరుగులు (528 మ్యాచ్‌లు)
జాస్ బట్లర్: 14,371 పరుగులు (510 మ్యాచ్‌లు)
డేవిడ్ వార్నర్: 14,284 పరుగులు (439 మ్యాచ్‌లు)
విరాట్ కోహ్లీ: 14,218 పరుగులు (430 మ్యాచ్‌లు)

# వరల్డ్ కప్‌లో భారత్ మహిళలకు తొలి ఓటమి.. 6 వికెట్ల తేడాతో సౌతాఫ్రికా విజయం




**హైదరాబాద్ పెన్ పవర్:** ఉమెన్స్ టి20 వరల్డ్ కప్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న భారత మహిళల జట్టుకు సౌతాఫ్రికా గట్టి బ్రేక్ వేసింది. మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా జరిగిన హై-వోల్టేజ్ పోరులో భారత్‌పై దక్షిణాఫ్రికా మహిళల టీమ్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ టోర్నీలో టీమిండియాకు ఇదే మొదటి ఓటమి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. ఓపెనర్ షఫాలీ వర్మ, ఆల్ రౌండర్ దీప్తి శర్మలు రాణించడంతో 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. అనంతరం 159 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికా.. మరో 5 బంతులు మిగిలి ఉండగానే టార్గెట్‌ను ఛేదించి విజయాన్ని అందుకుంది.

**మొదట్లో సౌతాఫ్రికాకు షాక్ ఇచ్చిన శ్రీచరణి:**

159 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన సౌతాఫ్రికా బ్యాటర్లను మన తెలుగమ్మాయి శ్రీచరణి ఆరంభంలోనే గట్టి దెబ్బ కొట్టింది. సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ (20) దూకుడుగా ఆడుతున్న క్రమంలో శ్రీచరణి తన స్పిన్ మ్యాజిక్‌తో క్యాచ్ అవుట్ చేసింది. ఆ వెంటనే క్రీజులోకి వచ్చిన అన్నరీ డెర్క్‌సెన్‌ను కూడా డకౌట్ చేసి పంపించింది. ఇలా వరుసగా రెండు వికెట్లు తీసి సౌతాఫ్రికాను కష్టాల్లోకి నెట్టింది.

**మారిజన్ కాప్, తజ్మిన్ బ్రిట్స్ దండయాత్ర:**

కష్టాల్లో పడిన సౌతాఫ్రికా జట్టును ఓపెనర్ తజ్మిన్ బ్రిట్స్, స్టార్ ఆల్ రౌండర్ మరిజానే కాప్ ఆదుకున్నారు. భారత బౌలింగ్‌ను టార్గెట్ చేస్తూ బౌండరీలతో విరుచుకుపడ్డారు. అరుంధతి రెడ్డి, శ్రీచరణి, ప్రేమ్ రావత్, నందని శర్మల ఓవర్లలో ఈ ఇద్దరు వన్-సైడ్ రచ్చ లేపారు. వీరిద్దరి మధ్య నెలకొన్న 97 పరుగుల భారీ భాగస్వామ్యానికి ఆఖర్లో షఫాలీ వర్మ బ్రేక్ వేసింది. హాఫ్ సెంచరీ వైపు దూసుకెళ్తున్న తజ్మిన్ బ్రిట్స్ (40) ను షఫాలీ అవుట్ చేసినప్పటికీ.. అప్పటికే మ్యాచ్ భారత్ చేతుల్లోంచి చేజారిపోయింది.

**మ్యాచ్ ఫినిష్ చేసిన మారిజన్ కాప్:**

తజ్మిన్ బ్రిట్స్ అవుట్ అయినప్పటికీ.. క్రీజులో పాతుకుపోయిన మారిజన్ కాప్ ఏమాత్రం తగ్గలేదు.. సెంచరీ దిశగా దూసుకెళ్తూ ఒంటిచేత్తో మ్యాచ్‌ను ముందుకు నడిపించింది. భారత బౌలర్లకు ఎలాంటి ఛాన్స్ ఇవ్వకుండా 81 పరుగులతో అజేయంగా నిలిచి సౌతాఫ్రికాకు ఘన విజయాన్ని అందించింది. భారత బౌలర్లలో శ్రీచరణి 3 వికెట్లు తీయగా, షఫాలీ వర్మ ఒక వికెట్ దక్కించుకుంది.

# వరల్డ్ కప్‌లో ఒకే ఒక్కడు.. అత్యధిక మ్యాచ్‌లు ఆడిన గోల్ కీపర్‌గా జర్మనీ ప్లేయర్ రికార్డు






**హైదరాబాద్ పెన్ పవర్:**ఫిఫా వరల్డ్ కప్ 2026 లో జర్మనీ ప్లేయర్ మాన్యుయెల్ న్యూయెర్ రికార్డు సృష్టించాడు. ప్రపంచ కప్ లో అత్యధిక మ్యాచ్ లు ఆడిన ఫ్రాన్స్ ప్లేయర్ హ్యూగో లోరిస్‌ను అధిగమించాడు. ఐవరీ కోస్ట్‌తో జరిగిన గ్రూప్ జు పోరులో 21వ మ్యాచ్ ఆడి, ఫిఫా ప్రపంచ కప్ చరిత్రలో అత్యధిక మ్యాచ్ లలో ఆడిన గోల్ కీపర్ గా ఈ ఘనత సాధించాడు. 20 ప్రపంచ కప్ మ్యాచ్‌లలో ఆడిన హ్యూగో లోరిస్‌ను న్యూయెర్ అధిగమించాడు. దీంతో గ్లోబల్ స్టేజ్ లో గోల్ కీపర్‌లకు సిరికొత్త బెంచ్ మార్క్ ను . ఇదే మ్యాచ్ లో ఐవరీ కోస్ట్ ఆటగాడు ఫ్రాంక్ కెస్సీ.. 30 నిమిషంలో గోల్ చేసి లెగసీని కొనసాగించాడు.ఆప్టా ప్రకారం, 29 సంవత్సరాల 183 రోజుల వయస్సులో ఐవరీ కోస్ట్ తరపున గోల్ చేసిన కెస్సీ.. ఈ ఏజ్ లో ఘనత సాధించిన ప్రపంచ కప్ చరిత్రలో రెండవ అతి పెద్ద ఆటగాడిగా నిలిచాడు. కెస్సీకి ముందు డిడియర్ డ్రోగ్బా ఉన్నాడు. 2010లో 32 సంవత్సరాల 101 రోజుల వయస్సులో గోల్ చేసి.. అతి పెద్ద వయసులో గోల్ చేసిన ఆటగాడిగా డిడియర్ డ్రోగ్బా ఫస్ట్ ప్లేస్లో ఉన్నాడు. 2026 ఫీఫా ప్రపంచ కప్ ముగిసిన తర్వాత రిటైర్ అవుతానని ఐవరీ కోస్ట్‌తో జరిగే మ్యాచ్‌కు ముందు ప్రకటించాడు

# వరుస అనౌన్స్మెంట్స్ ఓకే.. మరి ఇప్పటికైనా గాడిన పడతారా?







మాస్ మహారాజా రవితేజ అంటేనే ఫుల్ ఎనర్జీ.. వరుస సినిమాలతో దూసుకుపోవడం ఆయన స్టైల్. అయితే గత కొంతకాలంగా ఆయనకు బాక్సాఫీస్ వద్ద సరైన సక్సెస్ పడటం లేదు. ఈ నేపథ్యంలోనే మళ్లీ పాత స్పీడ్ అందుకోవడానికి రవితేజ కేవలం రెండు నెలల గ్యాప్‌లోనే రెండు భారీ ప్రాజెక్టులను పట్టాలెక్కించేందుకు రెడీ అవుతున్నారు. ఒక క్రేజీ నిర్మాతతో, మరో విలక్షణ దర్శకుడితో రాబోతున్న ఈ సినిమాలు ఆయన కెరీర్‌ను మళ్లీ ట్రాక్‌లోకి తెస్తాయని ఫాన్స్ గట్టిగ నమ్ముతున్నారు ..మరి ఆ విశేషాలు చూద్దాం..

**దిల్ రాజు బ్యానర్‌లో మాస్ జాతర:**

సినీ వర్గాల సమాచారం ప్రకారం.. స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మాణంలో రవితేజ చేయబోయే కొత్త సినిమా షూటింగ్ వచ్చే ఆగస్టు నుంచి ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు, నటీనటుల ఎంపిక వేగంగా జరుగుతున్నాయి. రవితేజను అభిమానులు ఎలా చూడాలనుకుంటున్నారో.. దానికి తగ్గట్టుగా ఒక పక్కా కమర్షియల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా ఈ కథను సిద్ధం చేసినట్లు ఇండస్ట్రీలో గట్టిగా టాక్ వినిపిస్తోంది.

**వివేక్ ఆత్రేయతో ఊహించని కాంబినేషన్:**

ఆగస్టులో దిల్ రాజు సినిమా మొదలైన రెండు నెలలకే.. అంటే అక్టోబర్ నుంచి రవితేజ మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను సెట్స్‌పైకి తీసుకెళ్లనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్న ఈ చిత్రానికి డిఫరెంట్ మేకింగ్ స్టైల్ ఉన్న వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహించబోతున్నారు. ఇప్పటివరకు క్లాస్ అండ్ కంటెంట్ సినిమాలే తీసిన వివేక్.. మొదటిసారి రవితేజ ఇమేజ్‌కు తగ్గట్టుగా యాక్షన్, ఎమోషన్స్,కామెడీ మేళవించి ఒక ఇంట్రెస్టింగ్ సబ్జెక్ట్ రాసుకున్నారట.

**ఫ్లాపుల్లో ఉన్నా తగ్గని రవితేజ మార్కెట్:**

ఇటీవల రవితేజ నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఆడలేదు. గత ఏడాది వచ్చిన 'మాస్ జాతర' కానీ, ఈ ఏడాది విడుదలైన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' వంటి సినిమాలు ప్రేక్షకులను పెద్దగా మెప్పించలేకపోయాయి. ఐనా సరే మాస్ మహారాజా క్రేజ్ అస్సలు తగ్గలేదు. ఇక ఆయన మార్కెట్‌పై నమ్మకంతో ఇప్పటికీ టాలీవుడ్ టాప్ నిర్మాతలు, దర్శకులు ఆయనతో సినిమాలు చేయడానికి లైన్ కడుతున్నారు.

**ఆశలన్నీ రాబోయే సినిమాలపైనే:**

వరుసగా రెండు పెద్ద ప్రాజెక్టులు లైన్‌లో పెట్టడం రవితేజ స్పీడ్‌కు నిదర్శనమే అయినా.. ప్రస్తుతం ఆయనకు ఒక సాలిడ్ బ్లాక్‌బస్టర్ హిట్ చాలా అవసరం. రాబోతున్న 'ఇరుముడి' చిత్రంతో పాటు దిల్ రాజు, వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో రాబోయే ఈ రెండు కొత్త సినిమాల్లో కనీసం ఒకటైనా గట్టిగా హిట్ కొడితేనే రవితేజ మళ్లీ ఫుల్ ఫేమ్‌లోకి వస్తారని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు.

వరుస అనౌన్స్మెంట్స్, షూటింగులతో రవితేజ ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహం వచ్చిన మాట నిజమే. కానీ కేవలం స్పీడ్ మాత్రమే కాదు, ఈసారి కంటెంట్ కూడా గట్టిగా ఉంటేనే మాస్ మహారాజా బాక్సాఫీస్ వద్ద పాత వైభవాన్ని అందుకుంటారు. మరి ఆగస్టు, అక్టోబర్ నెలల్లో రాబోతున్న ఈ కొత్త ప్రాజెక్టులు రవితేజను మళ్లీ సక్సెస్ ట్రాక్ ఎక్కిస్తాయో లేదో వేచి చూడాలి..

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965